# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శుక్రవారం, మే 08, 2026 | సంపుటి - 20 | సంచిక 232 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

- రిపీటెడ్‌గా పట్టుబడితు పిడి యాక్ట్ పెట్టే ఆలోచన
- ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు
- సమీక్షలో డిజిపి సివి ఆనంద్



హైదరాబాద్ : రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు.

తరువాయి 2లో

## పదేళ్ల బిఆర్ఎస్ కన్నా
# రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

### 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ

- బిఆర్ఎస్ విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు
- రైతులు ఆర్గానిక్ వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి
- వరంగల్ రైతుమేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల



హనుమకొండ : గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌవకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని ప్రస్తావించారు.

2లో

బిఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు.




## మహిళా సంగాలకు
# సీతక్క శుభవార్త

### వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు
### ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు
### పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్ : మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు. మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు.

2లో



## ప్రతి పేద కుటుంబానికి
# సొంత ఇల్లు

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్ష
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ : ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.



## తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ

### గవర్నర్‌తో మరోమారు విజయ్ భేటీ
### మెజార్టీకి అవసరమైన మద్దతు లేఖలు కోరిన గవర్నర్
### టివికె పార్టీకి అధికారం దక్కడంపై తొలగని అనిశ్చితి

చెన్నై : తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు

## రాజ్యాంగేతర శక్తిగా తమిళ
# గవర్నర్ వ్యవహారం

### ప్రజాతీర్పును గౌరవించకపోవడం అవమానం
### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు



హైదరాబాద్ : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు. 108 స్థానాలు గెలిచి సింగిల్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు.

2లో



## ప్రజా సమస్యలకు
# వందశాతం పరిష్కారం

### పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు
### సింగపూర్ పాలనా విధానంపై అధ్యయనం
### మోడల్‌గా ఓ జిల్లాలో అమలు చేసి చూద్దాం
### కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి : ప్రజా సమస్యలను వంద శాతం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలన్నారు. సచివాలయంలో ఏడో విడత కలెక్టర్ల సదస్సులో అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అందరం సమష్టిగా పని చేయాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. సరిగా పరిపాలించకపోతే ప్రజలు ఆమోదించే అవకాశం లేదని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైందన్నారు. 'ప్రజా సంతృప్తే నాకు కొలమానం. ప్రస్తుతం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. గత ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను దారి మళ్లించింది. దీంతో కేంద్రం నిధులు ఇవ్వడం ఆపేసింది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆగిపోయింది. అభివృద్ధి లేకుంటే సంపద లేదు.. సంపద లేకుంటే సంక్షేమం లేదు.

# బెంగాల్ అసెంబ్లీ రద్దు

### గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు
### రాజీనామాకు మమత ససేమిరా అనడంతో నిర్ణయం

2

## ఒకే ప్లాట్ ఫాంపైకి
# రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు



### వేగంగా డిజిటలైజేషన్ పక్రియ పూర్తి
### సిటిజెన్ ఫ్రెండ్లీగా రిజిస్ట్రేషన్ శాఖ
### కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి : రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. డిజిటలైజేషన్ పక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో

# డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు.రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

# రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని ఈ సందర్భంగా గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు. కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

# బెంగాల్ అసెంబ్లీ రద్దు

కోల్‌కతా,మే7 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం రద్దు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో.. గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. రాజీనామా చేసేది లేదని ఇటీవల మమతా బెనర్జీ ప్రకటించారు. దీంతో ఈ చర్య అనివార్యమయ్యింది. లేకుంటే రాజ్యాంగ పరంగా చిక్కులు వచ్చేవి. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బీజేపీకి కట్టబెట్టారు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య ప్రకటించారు. రోవైపు ముఖ్యమంత్రి అభ్యర్థిపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువేందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు విలన్ ఈసీ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదంటూ ఆమె భీష్మించుకున్నారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి గురువారంతో ముగిసింది. అయినా సీఎం పదవికి మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో గత ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రకటించారు.

# పంజాబ్‌లో ఇడి సోదాలు

## కిందకు విసిరేసిన రెండు నోట్ల కట్టల బ్యాగులు

## కారులో వచ్చిన డ్రైవర్ వాటితో పరార్

చండీఘడ్,మే7 : పంజాబ్ లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహిస్తుండగా.. అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈడీ దాడుల భయంతో.. రూ.500 నోట్ల కట్టలతో నిండిన రెండు బ్యాగులను కిందకు విసిరేశారు. ఆ తర్వాత ఓ వాహనంలో అక్కడికి వచ్చిన డ్రైవర్ ఆ బ్యాగులు తీసుకుని పరారయ్యాడు. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశం అయింది. గ్రేటర్ మొహాలీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ లో భూవినియోగ అనుమతుల్లో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నితిన్ గోహల్‌కు, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌కు ఓఎస్డీగా ఉన్న రజబీర్ ఘుమాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా.. ఈ కేసుకు సంబంధించి పంజాబ్, చండీగఢ్ లలోని పలువురు బిల్డర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు సంబంధించిన భవనాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు గురువారం సోదాలు చేశారు. ఈ క్రమంలోనే మొహాలీలోని ఖరార్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లోకి అధికారులు చేరుకోగానే.. అక్కడినుంచి రూ.500 నోట్ల కట్టలతో నిండిన రెండు బ్యాగులను ఎవరో కిందకి విసిరేశారు. అదే సమయంలో ఓ వాహనంపై వచ్చిన డ్రైవర్ వాటిని తీసుకొని అక్కడినుంచి పరారయ్యాడు. నోట్ల కట్టలతో ఉన్న బ్యాగు దృశ్యాలను ఎవరో సోషల్ మీడియాలో షేర్ చేయగా.. తాజాగా అది వైరల్ అవుతోంది. అయితే ఈ ఘటనను ఈడీ అధికారులు ఇంకా ధ్రువీకరించలేదు.

# పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా రూ.లక్షకోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని తెలిపారు. కేసీఆర్ హయాంలోని అవినీతి, అహంకారాన్ని రైతులు ఎప్పటికీ మరచిపోరని చెప్పుకొచ్చారు. కాకతీయుల గడ్డపై కేటీఆర్, తదితరులు చేసిన ప్రసంగాన్ని ప్రజలంతా అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. మొక్కజొన్నలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్నలు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేదికపైనే కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. దేశంలో రైతులకు యూరియా అందించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు సంబంధించిన అంశంలో వెనకడుగు వేయబోమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కొంతమంది తనను అవమానపరచాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలు పంట మార్పిడి చేయాలని, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశర చేశారు. రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ సర్కార్ రూ.21 వేల కోట్లను జమ చేసింది. రూ.లక్ష రుణమాఫీని కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పూర్తి చేయలేదు. రుణమాఫీకి బీఆర్ఎస్ ఐదేళ్ల సమయం తీసుకోవడంతో.. వాళ్లిచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదు. ఒక్క రైతుబంధు ఇచ్చి.. మిగతా పథకాలన్నింటినీ నిలిపివేశారు. బీఆర్ఎస్ అహంకార వైఖరిని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. ఇవాళ రైతులకు అప్పులు తక్కువున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని తుమ్మల తెలిపారు.

# మహిళా సంగాలకు సీతక్క శుభవార్త

మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు. పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానని ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధ చూడ లేక తాను తుపాకీ పట్టానని వివరించారు. ఆ అనుభవంతోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క తెలిపారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ సాధించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని మంత్రి సీతక్క అభినందించారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు వంద శాతం బ్యాంకులకు రీపేమెంట్ చేయాలని సూచించారు. బ్యాంకర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టాలని మహిళా సంఘాలకు మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బ్యాంకర్లకు మంత్రి సూచించారు. బ్యాంకులకు తాము గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత తమదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని.. అదే మహిళా శక్తికి సహకరిస్తే మీ నగదుకు భద్రత లభిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

# ఒకే ప్లాట్ ఫాంపైకి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు

జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనాపరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని... ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను రీ-ఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్సరెన్స్ ఉపకరిస్తోందని సీఎస్ సాయిప్రసాద్ అన్నారు. సుపరిపాలనతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ప్రభుత్వ విధానమని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు- సర్వీస్ డెలివరీ అనేది అత్యంత కీలకమైన అంశమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నిర్దేశిరచిన 10 సూత్రాల ఆధారంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయగలమని తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తేనే అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించగలమన్నారు. విద్య, వైద్యం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా ప్రజలకు అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ నిర్ణయాలు తీసుకోవటంలో ఎలాంటి సంకోచం ఉండకూడదని సీఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

# తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ

మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు సమకూరిన అనంతరం రావాలని సూచించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తం చేసింది. ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో




ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఒదిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్దిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్దిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన పేదలనే లబ్దిదారులుగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నా మని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# ప్రజా సమస్యలకు వందశాతం పరిష్కారం

రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకొచ్చాం.గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారింది. దేశంలో ఉన్న అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయి. వారానికో కంపెనీ తీసుకొస్తున్నాం. రోజుకో శంకుస్థాపన చేస్తున్నాం. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు.మంత్రుల సింగపూర్ పర్యటనపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ తదితర అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నేర్చుకోవటం అనేది నిరంతర పక్రియ అని తెలిపారు. అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సింగపూర్‌లో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయని చెప్పారు. సింగపూర్‌లోని అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేద్దామని అన్నారు. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ఎ÷-లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. 'నేను కాదు మనం అనే విధానంలో ముందుకు వెళ్తాం.. ఈ విధానం నేటి నుంచి నాతో మొదలవుతుంది' అని సీఎం పేర్కొన్నారు. బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ.. వారానికో శంకుస్థాపన జరుగుతోందన్నారు. వేగంగా పనిచేయాలని.. అంతే వేగంగా అభివృద్ధి చూపించాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదన్నారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలని తెలిపారు. కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశానని... ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చామని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# ముగ్గురి ప్రాణాలు తీసిన ఈత సరదా

## హల్దీ వాగులో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం

సిద్దిపేట,మే7 : సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒక శుభకార్యానికి హాజరై, ఆ సంతోషాన్ని పంచుకోవాల్సిన యువకులు విగతజీవులుగా మారడంతో వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ (27), వికాస్ (27), ఆనంద్ రెడ్డి (27) అనే ముగ్గురు స్నేహితులు బుధవారం నాడు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన ఒక పెళ్లి వేడుకకు హాజరయ్యారు. వివాహ వేడుక అనంతరం, గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం సమీపంలోని హల్దీ వాగు వద్దకు చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో.. సరదాగా వాగులో ఈత కొట్టాలని నిర్ణయించు కున్నారు. వాగులోకి దిగిన ఈ ముగ్గురు స్నేహితులకు నీటి లోతుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం పోలీసులు మరియు గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులంతా ఒకే వయసు వారు (27 ఏళ్లు) కావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే ఊరికి చెందిన ముగ్గురు యువకులు, అందులోనూ ప్రాణ స్నేహితులు ఇలా ఒకేసారి మృతి చెందడంతో నర్సాపూర్‌లో విషాదం నెలకొంది. పెళ్లికి వెళ్లి వస్తామని చెప్పిన కొడుకులు శవాలై రావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలాశయాలు, వాగుల వద్దకు వెళ్లేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని, నీటి లోతు తెలియకుండా లోపలికి వెళ్లడం ప్రాణాంతకమని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.

# కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

## ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది

## మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్,మే7 : జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు.

# తమిళనాట మళ్లీ రిసార్ట్ రాజకీయాలు

**ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన ఎఐడిఎంకె**

**అద్భుతం జరగోతోందన్న ఎఐడిఎంకె నేత అన్బళగన్**

చెన్నై,మే7 : తమిళనాడు రాజకీయ వేదికపై మళ్ళీ 'రిసార్టు రాజకీయాలు' వేడెక్కాయి. గత కొద్దిరోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, ఎఐడిఎంకె త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అన్బళగన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా ఒక 'అద్భుతం' జరగబోతోందని ఆయన వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అన్బళగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'మాకు ప్రస్తుతం 118 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తోంది. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఇతర పక్షాల మద్దతు కూడా మాకు లభించబోతోంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు దిశగా పావులు కదుపుతున్న ఎఐడిఎంకె, తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రంలో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. సీనియర్ నేతల పర్యవేక్షణలో సుమారు 27 మంది ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు చేరుకున్నారు. సీవీ షణ్ముగం నేతృత్వంలో మిగతా ఎమ్మెల్యేలను మరొక రహస్య ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. తమ ఎమ్మెల్యేలపై ఒత్తిడి రాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అన్బళగన్ చెప్పిన ఆ 'అద్భుతం' ఏ రూపంలో ఉండబోతోంది? అనేది హాట్ టాపిక్ గా ఉంది.

# గతానుభవాలను గవర్నర్ గుర్తించాలి

**విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలి**

**తమిళ నటుడు విశాల్ వ్యాఖ్యలు**

చెన్నై,మే7 : ప్రస్తుతం తమిళనాడులో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నటుడు విశాల్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. 2017-18లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలను విశాల్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఎ÷-లోర్ టెస్ట్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని విశాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం తమిళనాడులో 233 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉందని, ఇలాంటి సమయంలో గవర్నర్ పాలన కాదని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే కావాలని విశాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని విశాల్ ప్రశ్నించారు. ప్రజల తీర్పుకు గౌరవం ఎక్కడ? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదని, ప్రజలకు కూడా తెలుసని విశాల్ అన్నారు. విజయ్ తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని, తాను కూడా అదే కోరుకుంటున్నానంటూ విశాల్ తన మద్దతు ప్రకటించారు.

# తండాలున్న ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెంచాలి: కోమటిరెడ్డి

హైదరాబాద్,మే7 : దేవరకొండ,ఆలేరు లాంటి ఎస్టీ జనాభా,తండాలు అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో అదనపు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటిని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. హిమాయత్ నగర్ హౌసింగ్ కార్పోరేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇందిరమ్మ ఇండ్లు,రెవెన్యూ సంబంధిత అంశాలపై జరిగిన సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వీరిఅధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రధాన అంశాలు ప్రస్తావించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి,తగు చర్యలకు అంగీకారం తెలిపారు.

# రేవంత్‌తో బండిసంజయ్ మిలాఖత్

కరీంనగర్,మే7 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ ఏది మాట్లాడితే.. బండి సంజయ్ అదే మాట్లాడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ తిట్టాల్సింది కేటీఆర్‌నా .. రేవంత్ రెడ్డినా అని ప్రశ్నించారు. బంగారం షాపులో దొంగతనం జరిగితే ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. రేవంత్‌ను సంజయ్ ఒక్క మాట కూడా ఎందుకు అనడం లేదని అన్నారు. భార్య పుస్తెలు అమ్మి పోటీ చేసిన బండి సంజయ్‌కు కోట్ల రూపాయలు ఎక్కడివని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర మంత్రికి లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేటీఆర్‌తో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిడితే ఊరుకునేది లేదన్నారు. బండి సంజయ్‌ను కూడా తాము తిట్టగలమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

**బిజెపి కార్యకర్తుల గుండాల్లో దాడులు చేయడమేంటి**

**మండిపడ్డ కెటిఆర్, హరీష్ రావులు**





హైదరాబాద్,మే7 : కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అనుచరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్యకర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అతిపెద్ద పార్టీగా టివికెను ఆహ్వానించాలి

**గవర్నర్ తాత్సారం చేయడం తగదు**

**తమిళనాడు లెఫ్ట్ పార్టీల డిమాండ్**

చెన్నై,మే7 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయంలో గవర్నర్ కార్యాలయం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ మద్దతు ప్రస్తుతం టీవీకే వద్ద లేదని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఉండాల్సిన సంఖ్యాబలంపై గవర్నర్.. విజయ్‌కు మార్గనిర్దేశర చేశారు. కేవలం అతిపెద్ద పార్టీగా ఉండటమే కాకుండా, సభలో తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు ఆధారాలు చూపాలని సూచించారు. మరోవైపు, అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే అధినేత విజయ్‌కే ప్రభుత్వం ఏర్పాటు చేసే మొదటి అవకాశం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. శణ్ముగం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పలు కీలక అంశాలను లేవనెత్తారు. 234 స్థానాలున్న అసెంబ్లీలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదని, అయితే 108 మంది ఎమ్మెల్యేలతో టీవీకే అతిపెద్ద పార్టీగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం విజయ్ మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చారని, మరే ఇతర కూటమి హక్కు కోరనప్పుడు గవర్నర్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను వాడుకుంటోందని సీపీఎం తీవ్రంగా ఆరోపించింది. విజయ్‌కు కేవలం సీపీఎం మాత్రమే కాకుండా, ఇతర పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సిపిఐ తదితర పార్టీలు కూడా ప్రజా తీర్పును గౌరవించి విజయ్‌కు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాయి. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తమిళనాడు ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికింది. 118 సీట్ల మెజారిటీ మార్కును అందుకోవడానికి టీవీకేకు ఇంకా మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఒకవేళ కాంగ్రెస్ (5 సీట్లు), సీపీఎం, సీపీఐ, వీసీకే వంటి పార్టీలు అధికారికంగా మద్దతు లేఖలు అందజేస్తే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. అప్పటి వరకు తమిళ రాజకీయాల్లో ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

# గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం

**నేడు లోక్‌భవన్ ముట్టడికి నిర్ణయం**

**రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు**

చెన్నైచెన్నై,మే7 : తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు అంశం ఇప్పుడు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోంది. అత్యధిక స్థానాలు సాధించిన టివికె అధినేత విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నేడురాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నేడు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం లోక్ భవన్‌ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీరు కేవలం కాలయాపన చేయడమే నని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉన్న టివికెకి, కాంగ్రెస్ (5 సీట్లు) వామపక్షాల మద్దతు కలిపితే మెజారిటీకి చేరువలో ఉన్నామని, ఈ తరుణంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. 'ప్రజలు మార్పును కోరుకున్నారు, కానీ గవర్నర్ మాత్రం ఢిల్లీ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ పిలుపుతో తమిళనాడులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే టివికె కార్యకర్తలు ఆందోళనలో ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా తోడవడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సీపీఎం, సీపీఐ పార్టీలు కూడా ఈ ఆందోళనలకు మద్దతు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గవర్నర్ వ్యవస్థను ఉపయోగించుకుని బీజేపీ రాష్ట్రంలో అస్థిరత సృష్టించాలని చూస్తోందని.. అందుకోసమే, నేటి ఉదయం నుంచే తమిళనాడులోని అన్ని ప్రధాన పట్టణాల్లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్ల మీదకు రానున్నాయని కాంగ్రెస్ ప్రకటించింది.

# కరీంనగర్ పిఎంజె జ్యువెలరీ షాపు దోపిడీ

**దొంగలు వాడిన బైక్ నంబర్ డూప్లికేట్**

కరీంనగర్,మే 7 : కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాపు దోపిడీ కేసులో ట్విస్ట్ బయటపడింది. దోపిడీ కోసం దుండగులు ఉపయోగించిన బైక్‌కు.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వాహనం నంబర్ వాడినట్లు విచారణలో బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ షాపు వ్యాపారి ద్విచక్ర వాహనం నంబర్‌ను దుండగులు వాడినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సదరు వ్యాపారిని హైదరాబాద్, కరీంనగర్ పోలీసులు విచారించారు. విచారణలో మొబైల్ వ్యాపారి అపాచీ బైక్ నంబర్‌ను దుండుగులు ఉపయోగించిన బైక్‌కు పెట్టుకుని పోలీసుల దృష్టి మళ్లించే ప్రయత్నం చేసినట్లు బయటపడింది. దీంతో ఆ నంబర్ దోపిడీ దొంగలకు ఎలా తెలిసిందనే దానిపై పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ వ్యాపారి ఇటీవల తన అపాచీ బైక్ అమ్మడానికి క్షఓచీలో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దుండగులు క్షఓచీలో బైక్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని ఆ నంబర్‌ను ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# రెగ్యులర్‌గానే సిఎం కాన్వాయ్

**ట్రాఫిక్ ఆపకుండా నేరుగా ప్రయాణం**

హైదరాబాద్,మే7 : తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటంకం కలిగించొద్దంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని బుధవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణం చేసింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి రెగ్యులర్ ట్రాఫిక్‌లోనే సీఎం వెళ్లడం విశేషం. తన కాన్వాయ్ రాకపోకల కోసం నగరవ్యాప్తంగా ప్రజల వాహనాలను నిలిపివేయొద్దంటూ నిన్న సీనియర్ పోలీసు అధికారులకు సీఎం ఆదేశించారు. రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యల్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీఎం కాన్వాయ్ కదలికల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఒకే లేన్‌లో కదలడానికి అనుమతించారు.

# మద్దతు లేఖలే అసలు సమస్య

**మెజార్టీ కోసం ప్రయత్నించని విజయ్**

**గతంలోనూ అనేక రాష్టాల్లో ఇదే సమస్య**

**గవర్నర్ల విచక్షణ మేరకు నిర్ణయాలు**

చెన్నై,మే7 : తమిళనాట రాజకీయ అనిశ్చితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. స్పష్టమైన మెజార్టీ లేక తిప్పలు పడుతోంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే, గతంలోనూ పలు రాష్టాల్లో హంగ్ వచ్చినప్పుడు. గవర్నర్ ఆదేశాలతో మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాలున్నాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే.. గవర్నర్ తన విచక్షణ మేరకు వ్యవహరించి సరైన అభ్యర్థిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అలా గత దశాబ్దంన్నర కాలంలో ఐదు రాష్ట్రాల్లో ఇలాంటి మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నదంటే మహారాష్ట్రలోనే..! 2019లో దాదాపు 34 రోజుల పాటు అక్కడ హైడ్రామా నడిచింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై వచ్చిన విభేదాల కారణంగా దశాబ్దాల నాటి భాజపా-శివసేన కూటమి విచ్ఛిన్నమైంది. అనంతరం అప్పటి అవిభజిత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్.. తన చిన్నాన్న శరద్ పవార్‌తో విభేదించి భాజపాతో చేతులు కలిపారు. అజిత్ వర్గం మద్దతు తీసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ముందుకొచ్చారు. గవర్నర్ ఇందుకు సమ్మతించడంతో ఆ ఏడాది నవంబరు 23న ఫడణవీస్ సీఎంగా.. అజిత్ డిప్యూటీగా ప్రమాణం చేశారు. కానీ, ఈ ప్రభుత్వం మూడు రోజులకే కుప్పకూలింది. వ్యక్తిగత కారణాలతో భాజపాకు గుడ్‌బై చెప్పిన అజిత్ పవార్.. తిరిగి శరద్ పవార్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అనూహ్యంగా కాంగ్రెస్, నాటి అవిభజిత శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి 'మహా వికాస్ అఘాడీ'గా ఏర్పడ్డాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఈ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 288 శాసనసభ స్థానాలున్న ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56, ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 సీట్లు వచ్చాయి. 2018లో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో మొత్తం 222 శాసనసభ స్థానాలుండగా.. ఆ ఎన్నికల్లో భాజపా 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 80, జేడీఎస్‌కు 37 సీట్లు దక్కాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 113 సీట్ల మెజార్టీ మార్క్ ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ నాటి గవర్నర్ వాజూభాయ్ వాలా.. భాజపా నేత యడియూరప్పను ఆహ్వానించారు. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో బలపరీక్ష అనివార్యమైంది. భాజపాకు సంఖ్యాబలం లేకపోవడంతో విశ్వాసపరీక్షకు వెళ్లకుండానే మూడు రోజులకే యడియూరప్ప ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం కాంగ్రెస్, జేడీఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. గోవాలో 40 శాసనసభ స్థానాలుండగా.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్ 17, భాజపా 13 సీట్లు గెలుచుకున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా నాటి గవర్నర్ మృదులా సిన్హా.. భాజపా నేత మనోహర్ పారికర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించగా.. చిన్న పార్టీల మద్దతుతో నాడు భాజపా సర్కారు గట్టెక్కింది. అదే ఏడాది (2017) మణిపూర్‌లో ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28, భాజపా 22 సీట్లు గెలుచుకున్నాయి. ఆ సమయంలో చకచకా పావులు కదిపిన భాజపా.. చిన్న పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడింది. మెజార్టీ చూపించడంతో నాటి గవర్నర్ నజ్మా హెప్తుల్లా ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించారు. దీంతో బీరేన్ సింగ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. మణిపూర్‌లో మొత్తం 60 శాసనసభ స్థానాలున్నాయి. దేశ రాజధాని దిల్లీలో 70 శాసనసభ స్థానాలుండగా.. 2013లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. 31 సీట్లతో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి 28, కాంగ్రెస్‌కు 8 సీట్లు దక్కాయి. నాడు సంఖ్యాబలం లేకపోవడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు భాజపా ముందుకు రాలేదు. ఆ తర్వాత గవర్నర్.. ఆమ్ ఆద్మీ పార్టీని ఆహ్వానించారు. దీంతో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. నాడు ఆయనకు కాంగ్రెస్ వెలుపలి మద్దతు ప్రకటించింది. అయితే, ఈ ప్రభుత్వం ఎన్నో రోజులు నిలవలేదు. 49 రోజుల తర్వాత కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో దిల్లీలో రాష్ట్రపతి పాలన ఏర్పడింది. ఆ తర్వాత 2015లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది.

# కరీంనగర్‌లో దాడులతో ఉద్రిక్తత

**గంగుల కమలాకర్ కార్యాలయంపై దాడి**

**కౌశిక్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసం**

**లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు**

కరీంనగర్,మే7 : కరీంనగర్ పట్టణంలో ఉ ద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. దీంతో హుజురాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కార్యాలయంలోకి బీజేపీ శ్రేణులు చొచ్చుకెళ్లారు. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. బీజేపీ కార్యకర్తలపై బీఆర్ఎస్ శ్రేణులు కర్రలతో దాడి చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేశారు. బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను క్యాంప్ కార్యాలయానికి తరలించి, గేట్లు మూసేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ఉదయం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు పాడి కౌశిక్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. భారీ బందోబస్తు నడుమ కౌశిక్ రెడ్డిని కరీంనగర్ నుంచి హుజురాబాద్‌కు తరలించారు. హుజురాబాద్ క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించారు. దీంతో వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు ఉండగానే బీజేపీ శ్రేణులు చొచ్చుకురావడంతో కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# సంపాదకీయం

## ధాన్యం కొనుగోళ్లలో దబాయింపులు !

ఏటా దేశంలో ధాన్యం కొనుగోళ్లు అన్నది ఓ పజిల్‌గా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నామని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం కొనండి అని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా కొనుగోళ్లు పెద్ద ఎత్తున ఎక్కడా కానరావడం లేదు. దీనికితోడు అకాల వర్షాం రైతుల నెత్తిన పిడుగు పడేసింది. ఇటీవలి అకాల వర్షం నిండా ముంచింది. అన్నదాత రెక్కలకష్టాన్ని నీళ్లపాల్జేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుప్రాంతాల్లో పడిన వర్షం దాటికి, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో తీవ్రమైన గాలులతో అకాల వర్షం కురవడంతో మంథని మార్కెట్ యార్డుతోపాటు ఆయా మండలాల్లోని వ్యవసాయ ధాన్యమంతా మట్టిలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పదిహేను రోజుల కిందటే కోతలు కోసి, ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు పడుతున్న తరుణంలో కోలుకోలేని దెబ్బతీసింది. కొనుగోళ్లు వేగంగా చేస్తే తమ ధాన్యం తడిసేది కాదని కుప్పల చుట్టూ వర్షం నీటిని చూపిస్తూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని మంత్రులు, అధికారులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అసలు ధాన్యమే కొనడం లేదని తెలంగాణలో బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మక్కల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతులు కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందన్నారు. ఎపిలో కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని మంత్రి అచ్చన్నాయుడు చెబుతున్నారు. మరి లోపం ఎక్కడో తెలియడం లేదు. కేంద్రం కూడా దేశంలో ఏయే పంటలు పండుతున్నాయో, వాటిని ప్రజలకు చేర్చడమెలా అన్నది ఆలోచన చేయడం లేదు. పంటలు బాగానే పండుతున్నాయి. గోదాముల్లో ఫుల్లుగా ఉంటున్నాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావడం లేదు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాల్లో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగ దారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది దళారులు మాత్రమే. పంజాబ్, హర్యానాల్లో గోధుమలు బాగా పండిస్తారు. గోధుమల ధర తగ్గితే సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరి స్తుంటారు. దేశంలో ప్రతి పంట పరిస్థితి ఇలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, మక్క రైతులు నాన కష్టాలు పడుతున్నారు. దీనికంతటికి కొనుగోలు విధానాలు, మద్దతు ధరల విధానాలు సక్రమంగా లేకపోవడమే అని గుర్తించాలి. దీనిని సంస్కరిస్తే తప్ప రైతులకు, వినోగదారులకు మనశ్శాంతి ఉండదు.

# పశ్చిమాసియా.. పెనం మీద నుంచి పొయ్యిలోకి?



'తమలపాకుతో నువ్వొకటంటే తలుపుచెక్కతో నే రెండంటా' అనే రీతిలో అమెరికా, ఇరాన్ దేశాలు పరస్పరం కవ్వింపులకు పాల్పడుతూ, ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూ పశ్చిమాసియాను ఇప్పటికే రణరంగంగా మార్చేశాయి. కాల్పుల విరమణ కొనసాగుతున్న ప్రస్తుత సమయంలో సంయమనం పాటించాలన్న ఇంగితం ఇరు దేశాలకూ కొరవడటంతో మళ్లీ యుద్ధజ్వాలలు రగులుకునే పరిస్థితి ఏర్పడింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అతిపెద్ద చమురు నిల్వల కేంద్రమైన ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌పై తాజాగా ఇరాన్ డ్రోన్లతో దాడి జరపడంతోపాటు హర్మూజ్ జలసంధిలో తిరుగాడుతున్న అమెరికా నౌకలపైనా విరుచుకుపడటంతో కాల్పుల విరమణకు కాలం చెల్లినట్లే కనిపిస్తోంది. ఫలితంగా ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం మళ్లీ మొదటికి వచ్చే పరిస్థితి దాపురించింది. అదే జరిగితే యుద్ధానికి దిగిన ఇరాన్, అమెరికా మాట అటుంచి, పశ్చిమాసియా సహా ప్రపంచ దేశాల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టే. పశ్చిమాసియాలో రగిలిన యుద్ధం తాలూకు ప్రభావం ఇప్పటికే దేశదేశాలనూ అతలాకుతలం చేస్తోంది. అనేక దేశాలలో పెట్రోలు, డీజిల్ ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెంచిన భారత ప్రభుత్వం రేపోమాపో పెట్రో ధరలనూ పెంచక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. దేశదేశాలనూ ఆర్థిక మాంద్యం కమ్ముకుంటున్న దాఖలాలు గోచరమవుతున్నాయి. ద్రవ్యోల్బణం అంతకంతకూ పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమవుతున్నాయి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యుడి మనుగడ కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితినుంచి ఏ ఒక్క దేశానికీ మినహాయింపు లేదు. కయ్యానికి కాలుదువ్విన అగ్రరాజ్యం పరిస్థితి సైతం ఇంతకంటే భిన్నంగా ఏమీ లేదు. పూటకో మాట, రోజుకో నిర్ణయంతో అమెరికాను భ్రష్టుపట్టిస్తున్న ట్రంప్ మహాశయుడి పుణ్యమాని, ఆ దేశంలోనూ చమురు, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. యుద్ధం కారణంగా అమెరికాకు ప్రత్యక్షంగా జరిగిన నష్టమూ తక్కువేమీ కాదు. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ సంస్థ అధ్యయనం మేరకు తొలి మూడువారాల్లోనే దాదాపు మూడు బిలియన్ డాలర్ల మేర సైనిక ఆస్తులకు నష్టం వాటిల్లినట్లు అంచనా. సుమారు 13 మంది సైనికులు మరణించగా, దాదాపు వందమంది వరకూ గాయపడ్డారు. ఈ యుద్ధంవల్ల తమకు ఎలాంటి ప్రయోజనమూ లేదని మెజారిటీ అమెరికన్లు భావిస్తున్నట్లు ఇపాన్-రాయిటర్స్ సంస్థ సర్వేలో తేలడం గమనార్హం. వారం రోజుల్లో ఇరాన్ మెడలు వంచవచ్చన్న ధీమాతో యుద్ధానికి దిగిన ట్రంప్ ఇప్పుడు యుద్ధాన్ని ఎలా ఆపాలో తెలియక తలకిందులవుతున్నారు. ఘర్షణ ముగించేందుకు అమెరికా తొమ్మిది ప్రతిపాదనలతో ముందుకు రాగా, వాటిని తోసిపుచ్చి ఇరాన్ 14 పాయింట్లతో కొత్త ప్రతిపాదనలను ముందుకు తీసుకువచ్చింది. తాత్కాలిక సంధి కాదు.. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించడమే తమకు కావలసిందని తెగేసి చెప్పడంతో అగ్రరాజ్యాధినేతకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. యుద్ధం ముగిసిందని ఒకసారి, ఇరాన్‌ను ఓడించడం తమకు చిటికెలో పని అని మరొకసారి, తాము సముద్రపు దొంగలవంటివారమని ఇంకొకసారి అర్థం పర్థం లేని ప్రకటనలు చేస్తూ, ప్రపంచ దేశాధినేతల ముందు చులకన అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మొండివాడు రాజుకన్నా బలవంతుడన్నట్లు జననష్టం, ఆస్తినష్టం ఎంత జరిగినా ఇరాన్ దిగిరాదనే వాస్తవాన్ని ట్రంప్ ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. బలప్రయోగం చేస్తే ఉభయభ్రష్టత్వం తప్ప ఒరిగేదేమీ ఉండదనే సత్యాన్ని ఇకనైనా గుర్తించాలి. నాటో సభ్యత్వ దేశాలు తనకు కలసిరావడం లేదని కారాలు మిరియాలూ నూరడం మాని, అవి ఎందుకు కలసి రావడం లేదో ఆలోచించాలి. ఒత్తిడి పెంచితే ప్రత్యర్థి తలవంచుతాడనే బైడెన్ సిద్ధాంతం ఇరాన్ విషయంలో పనిచేయదన్న విషయం యుద్ధం మొదలైన ఈ రెండు నెలల్లోనే బోధపడింది. కాబట్టి చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలన్న చిత్తశుద్ధి కనబరిస్తే తమకూ, ప్రపంచ దేశాలకూ కూడా ట్రంప్ మేలు చేసినవారవుతారు. ఇరాన్ యురేనియం శుద్ధి ప్రక్రియ విషయంలోనూ అగ్రరాజ్యం తన ఉడుంపట్టును సడలించుకోవలసిన అవసరం ఉంది. 20 ఏళ్ల నిషేధం కాకుండా ఉభయతారకంగా ఉండేలా నిబంధనలను రూపొందించుకోవడం ఉత్తమం. ఇరాన్ కోరుతున్నట్లుగా ఒప్పందం అంటూ కుదిరితే, ఆ దేశం పై తాత్కాలికంగా కాకుండా, శాశ్వతంగా దాడులు చేయకుండా ఉండాలి. అమెరికా- ఇరాన్ తీసుకునే నిర్ణయాల ప్రభావం ప్రత్యక్షంగా పశ్చిమాసియా భవిష్యత్తుపైనా, పరోక్షంగా ప్రపంచదేశాలపైనా ఉంటుందనే విషయాన్ని గమనించి ముందడుగు వేయాలి.

# గోధుమ ధరల పతనం

## పిండి ధరలు మాత్రం పైపైకి

న్యూఢిల్లీ,మే7 : గోధమ ధరల పతనం రైతులను ఆందోళన కలిగిస్తోంది. మద్దతు ధరలు ఉన్నా, ఉత్పత్తి పెరిగిన కారణంగా ధరలు పడిపోతున్నాయి. దీంతో పలు రాష్ట్రాల్లో గోధులమలు పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓ వ్యాపారి సమాధాన మిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది. గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొ÷-టెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు.

# కేరళకు చేరుకున్న కాంగ్రెస్ పరిశీలకులు

## ముఖ్యమంత్రి అభ్యర్థిపై తర్జనభర్జనలు

తిరువనంతపురం,మే7 : కేరళంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఫలితాలు వెలువడి మూడు రోజులు గడిచినప్పటికీ.. సిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ 63 స్థానాలను గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) 22 స్థానాల్లో విజయం సాధించింది. కేరళం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తన మొదటి శాసనసభ పక్ష సమావేశాన్ని తిరువనంతపురంలో గురువారం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వి.డి. సతీసన్, కె. సురేష్, దీప్‌దాస్ మున్షీ సహా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులైన ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్‌లను కలిసేందుకు తిరువనంతపురంలోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్ మీడియాతో మాట్లాడారు. ఈ చర్చలు కాంగ్రెస్ హైకమాండ్ పక్రియలో ఒక భాగమని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా, రాకపోయినా సిఎల్ పి నేతను ఎంపికే చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలకులను పంపుతుందని అన్నారు. ఇదే పక్రియ కేరళలోనూ చేపట్టనున్నారని అన్నారు. హైకమాండ్ ఇద్దరు అత్యంత సీనియర్ నాయకులను, వర్కింగ్ కమిటీ సభ్యులను పరిశీలకులుగా నియమించిందని అ న్నారు. గతంలో కేరళ బాధ్యతలు చేపట్టిన, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉన్న సీనియర్ నేత ముకుల్ వాస్నిక్, ప్రస్తుతం ఏఐసీసీ కోశాధికారిగా ఉన్న అజయ్ మాకెన్లను పరిశీలకులుగా నియమించిందని అన్నారు.

# నిధులు లేని కార్పోరేషన్లకు ఛైర్మన్ల నియామకం

## బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయడం తగదు: వేముల

నిజామాబాద్,మే7 : సీఎం రేవంత్‌రెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంపై లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దకుతుందని విమర్శించారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కుమ్రంభీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం, వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు.కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సంక్షేమం కంటే అనుచరులను సంతృపిపరచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు ఛైర్‌పర్సన్లు ప్రకటించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరికొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదమని ఆక్షేపించారు. నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన ఛైర్మన్లు ప్రజలకు ఒక రూపాయి కూడా సాయం చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకుగాను 21 కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా ఇవ్వకుండా వాటి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ లో నిలదీస్తే సరైన సమాధానం లేదని పేర్కొన్నారు.

# కర్తవ్య బోధన !

తిరుమల : భగవద్గీత పారాయణం ప్రతి ఒక్కరికీ నిత్యకృత్యం కావాలి. శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి కర్తవ్య నిర్వహణ ఎట్లా చేయాలో తెలియక తపన చెందే హృదయానికి ఉపశమనంగా అనుగ్రహించినటువంటి మహోపదేశం భగవద్గీత. అర్జునుడికే కాదు, కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకి సందిగ్ధతకి సమాధానంగా భగవద్గీత ఈ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది, ఏ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది. ఏ పని ఎట్లా చేయాలి, ఎంత వరకు చేయాలి అనే సంశయం కలిగిన వ్యక్తికి ఒక శ్రేయ సాధనంగా భగవద్గీత ఉపయోగపడుతుంది. నాకు కర్తవ్యం ఏమిటో తెలియట్లేదు కానీ, 'ఏ శ్రేయస్యం నిశ్చితం భూహితన్మే' నేను శ్రేయస్సుని కోరుకుంటున్నాను, నాకేది శ్రేయస్సో అది చెప్పు అని అర్జునుడు అడిగినది. శ్రేయస్సుని పొందాలి అనుకున్నవాడికే ఏమైనా చెప్పడం అవసరం, ఆ శ్రేయస్సు కోరే వ్యక్తి ఏ స్తాయిలో ఉన్నా అందరికి అందేలా శ్రీకృష్ణ భగవానుడు అందించిన ఉపదేశమే భగవద్గీత. అది వ్యక్తి గతంగా చిన్న స్థాయిలో కావచ్చు, యువ స్థాయిలో కావచ్చు, ఒక గృహస్తుగా జీవించే వ్యక్తి స్థాయిలో కావచ్చు, లేక వ్యాపారమో, వాణిజ్యమో, ఔద్యోగికమో ఏదో రకమైన శ్రేయస్సుని పొందాలి, అది ఆత్మోజ్జీవ నకరమై ఉండాలి అనే వ్యక్తికి భగవంతుడు చేసిన అతి శక్తి వంతమైన ఉపదేశమే శ్రీమద్భగవద్గీత.మనకూ సంశయాలు తీరుతాయి, చేయాల్సిన కర్తవ్యం గుర్తితాం. చేసే తెలివి కలుగుతుంది. జీవితాన్ని సుఖమయం చేసుకుంటాం. ఉపద్రవాలు వస్తూనే ఉంటాయి, అవి ఉపశమించాలి, అపన్నులైన వ్యక్తులను ఆదుకొనే హృదయ సౌకుమార్యం ఏర్పడాలి. మనం చెదరకుండా ఉండేందుకు మనో ధైర్యం ఏర్పడాలి. ఇవన్నీ కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.



ఆధ్యాత్మికం

# రైతుల సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత...

**● రైతు సంక్షేమంపై కేటీఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది ● కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడమే బిఆర్ఎస్ పని ● ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మరియు కాంగ్రెస్ ప్రభుత్వం పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రైతు సంక్షేమం గురించి కేటీఆర్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని అన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ ఏలుబడిలో ఏనాడు రైతు సమస్యలను, రుణమాఫీ ని పట్టించుకోని కెసిఆర్, కేటీఆర్ లు ఈరోజు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎమ్మెల్యే విజయ రమణ రావు దుయ్యబట్టారు.ఏకకాలంలో దాదాపు 20వేల కోట్ల రూపాయలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి దేశంలో చరిత్ర సృష్టించిందని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 12 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని కేటీఆర్ అబద్ధాలు మాట్లాడటం ఆయన నైజాన్ని తెలియజేస్తుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన రుణమాఫీ జరిగిన తీరు రైతులు చెప్తారని ఆయన స్పష్టం చేశారు.వరి వేసుకుంటే ఉరే అని కెసిఆర్ వారి ప్రభుత్వ హయంలో మాట్లాడారని , పత్తి, సన్నవడ్ల పంటలు వేయడంపై అయోమయం సృష్టించి రైతులను ఆగం చేశారని అన్నారు. కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లు పండిస్తే క్వింటాలుకు 500 చొప్పున 1740 వేల కోట్ల బోనస్ ను చెల్లించి రైతులను ఆదుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో నష్టాన్ని భరిస్తూ కూడా మార్క్ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేస్తూ మద్దతు ధర చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నదని చెప్పారు. రైతు సంక్షేమమే ఊపిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడమే బీఆర్ఎస్ పనిగా పెట్టుకున్నారని.



రాష్ట్రంలో రైతులు పూర్తి సంతృప్తితో ఉండగా బీఆర్ఎస్ నేతలకు కడుపు మండు తోందన్నారు. బిఆర్ఎస్ పార్టీ వారు ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ రైతాంగం కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉంటారని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ వారు తమ ప్రభుత్వ హయంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కోతలు విధించి వారి జేబులు నింపుకొని రైతుల నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పండించిన పంటలో గింజ కటింగ్ లేకుండా చేస్తూ సన్న రకం వడ్లకు 500 రూపాయలు బోనస్ అందించి రైతులను కాపాడుతున్నామని అన్నారు. ఈ మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు.

# కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ నియామకం..

**● సహకరించిన సీఎం, పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు రాజ్యసభ సభ్యులు, విప్‌లు, ఎమ్మెల్యేలు, కరీంనగర్ కాంగ్రెస్ నేతలందరికీ కృతజ్ఞతలు తెలిపిన వెలిచాల రాజేందర్ రావు**





**కరీంనగర్ టౌన్,మే7(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి తెలంగాణ ప్రభుత్వం కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అకుల నర్సయ్య, వైస్ చైర్మన్ గా సుదగోని లక్ష్మీనారాయణ గౌడ్ నియమితులయ్యారు. మార్కెట్ కమిటీ సభ్యులుగా పంజాల శ్రీనివాస్ గౌడ్, బోనాల శ్రీనివాస్, ఖాజా, రుద్ర రాము, మీసాల శంకర్, తపట్ల రాజు, జగ్గని కనకయ్య, రావణవేణి సంపత్, కసవేని భూమయ్య, మాలోతు మాలతి, శివనాధుని వెంకటేశ్వర్లు, పల్లా శివకుమార్‌ను నియమించారు. అదేవిధంగా కరీంనగర్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కూడా కమిటీలో సభ్యులుగా ఉంటారు. మార్కెట్ కమిటీ పాలవర్గ నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి విప్ లు విజయ రమణారావు ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్ కోడూరు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ టి సంతోష్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ కాంగ్రెస్ నాయకుడు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ తో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు అందరికీ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంలో కీలక పాత్ర పోషించిన సహకరించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గానికి రాజేందర్ రావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేయాలని రాష్ట్రంలోనే అత్యుత్తమ మార్కెట్ కమిటీ కమిటీగా తీర్చిదిద్దాలని రాజేందర్ రావు సూచించారు.

# పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి రైతులకు ఆర్థిక నష్టం

## మధిర రూరల్ సీఐ డీ. మధు

**మధిర (ది క్రైమ్ న్యూస్):** రైతులు పంటల అవశేషాలను కాల్చడం ద్వారా మంటలు విస్తరించి ప్రమాదాలకు పంటలు నష్టాలకు దారి తీసే అవకాశం ఉందని, అగ్ని ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలని మధిర రూరల్ సిఐ మధు రైతులను కోరారు. గురువారం తన కార్యాలయంలో బోనకల్ మధిర రూరల్ పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓ లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పంటలు కోతలు అయిపోయిన తర్వాత మిగిలిన అవశేషాలను కాల్చేందుకు ఎక్కువగా ప్రయత్నిస్తుంటారు, అని అన్నారు. దీనివలన సమీప పొలాలలోని పంటలకు మంటలు విస్తరించే అవకాశం ఉందని అన్నారు. ఈ క్రమంలోనే విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సీఐ మధు తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. సర్కిల్ పరిధిలో మొక్కజొన్న పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చు తున్న ఘటనలు తరచుగా వెలుగుచూస్తున్నాయని అన్నారు. పంట అవశేషాలను కాల్చినప్పుడు కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. అలాగే, దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపో తుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధార పడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు. రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశు గ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధ తులు అనుస రించడం వంటి ప్రత్యామ్నా యాలను అవలంబించాలని ఆయన రైతులను కోరారు. పంటల అవశేషాలను కాల్చే చర్యలను నిలువరించేందుకు రైతులకు అవగాహన కల్పించే దిశగా పోలీస్ శాఖ ద్వారా చర్యలు చేపడుతున్నామని సీఐ తెలిపారు.



# కార్పొరేట్ కళాశాల స్కీమ్ క్రింద నమోదు చేసుకొనుటకు మే 11 లోపు ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి

**● జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** 2026-27 సంవత్సరానికి రెప్యూటెడ్ (కార్పొరేట్) జూనియర్ కళాశాల స్కీం క్రింద నమోదు చేసుకొనుటకు జూనియర్ కళాశాలలు ఆన్ లైన్ లో మే11లోపు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరమునకు కార్పోరేట్ జూనియర్ కళాశాలల స్కీం క్రింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఈబీసీ విద్యార్థిని, విద్యార్థులకు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు కల్పించుటకు గాను, పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుండి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలను నూతనముగా ఎంపిక చేయుటకు రెసిడెన్సియల్ వసతి కలిగిన, విద్యా బోధన లో ఉన్నత ప్రమాణాలు కలిగి, కాంపిటెటివ్ పరిక్షలలో ఎక్కువ సంఖ్య ఉత్తీర్ణతా శాతము కల్గినటువంటి జూనియర్ కళాశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు.ఆసక్తి గల కళాశాలలు తమ కళాశాలల యొక్క 5 సంవత్సరాలకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్ తో పాటుగా ఈ-పాస్ వెబ్ సైట్ ద్వారా తమ కళాశాలల యొక్క ఈపాస్ యూజర్ ఐడి, పాస్ వర్డ్ తో లాగిన్ అయి మే 11 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సదరు కళాశాలలు ఆన్ లైన్ లో రిజిస్టర్ చేసుకున్న తరువాత తమ దరఖాస్తులకు కళాశాల యొక్క బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అనుబంధ దృవీకరణ పత్రం, భవనము, హాస్టల్ వసతి వివరాలు, క్లాసు రూమ్స్ , డార్మిటరీ వివరాలు, అకాడమిక్ రికార్డు, (ఇంటర్మీడియట్ రిజల్ట్ లో కళాశాల ఉత్తీర్ణతా 90 శాతం, మొదటి శ్రేణిలో 50 శాతం ఉత్తీర్ణతా కలిగి ఉండాలి), ఐ.ఐ.టి/జె.ఇ.ఇ./ఎ.ఇ.ఇ.ఇ.ఇ/యం.సెట్ కాంపిటేటివ్ పరీక్షలో సాధించిన ఫలితాల వివరాలు, ఫ్యాకల్టి వివరాలు ( సీనియారిటి వివరాలు), కళాశాల యొక్క ల్యాబ్ , లైబ్రరీ వివరాలను జతచేసి మే12 సాయంత్రం 5 గంటల లోగా పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. ఎంపిక కాబడిన కళాశాలలో చదువుచున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు క్రింద ప్రతి విద్యార్థికి 35 వేల రూపాయలు, ప్రతి విద్యార్థికి పాకెట్ మనీ క్రింద 3 వేల రూపాయలు ప్రతి సంవత్సరం మంజూరు చేయబడుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# సుల్తానాబాద్ పట్టణ బిజెపి దళిత మోర్చా అధ్యక్షునిగా ఇనుగాల శ్రీనివాస్ నియామకం



**సుల్తానాబాద్, మే 07(ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ సుల్తానాబాద్ పట్టణ దళిత మోర్చా అధ్యక్షునిగా ఇనుగాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సుల్తానాబాద్ బిజెపి పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు గురువారం ఆయనకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇనుగాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజుకు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణ రెడ్డికి, దుగ్యాల ప్రదీప్ రావుకు, జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ్ కు, ఇతర జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి క్రమశిక్షణకు లోబడి, పార్టీ అప్పగించిన ప్రతి పనిని విజయవంతంగా పూర్తి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఫలాలు దళిత వర్గాలకు అందేలా చూడటంతో పాటు, అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలను అభినందిస్తూ, అందరి సహకారంతో సుల్తానాబాద్‌లో బిజెపి జెండాను మరింత ఎత్తులో ఎగురవేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మధిర రైతు వేదిక నందు ప్రజాపాలన కార్యక్రమం

**- సబ్సిడీ ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలు: సూరంశెట్టి కిషోర్**





**మధిర (ది క్రైమ్ న్యూస్):** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు సౌర విద్యుత్ కేంద్రాలు పీఎం కుసుం వ్యవసాయం యాంత్రికరణ డ్రోన్ వినియోగం అనే అంశాలపై మధిర రైతు వేదిక నందు గురువారం నాడు సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందించటం వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అలాగే సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవటం కోసం ప్రభుత్వం ద్వారా 85% పెట్టుబడిని అందించడం లాంటి అవకాశాలు ఉపయోగించుకొని రైతులు రాజుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్ బాణావత్ రమణ నాయక్ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరావు రేవతి ములకలపల్లి వినయ్ వంకాయలపాటి బాబు డి ఎ ఓ పుల్లయ్య ఎలక్ట్రికల్ డిఈ శ్రీనివాస్ అగ్రికల్చర్ సైంటిస్ట్ నాగజ్యోతి టౌన్ ఎఇ అనిల్ రూరల్ ఏఈ మైధిలి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ రాఘవరెడ్డికి వినత పత్రం అందజేసిన బోనకల్ గ్రామ సర్పంచ్



**మధిర (ది క్రైమ్ న్యూస్):** మధిర నియోజకవర్గ బోనకల్ టి గ్రామ అభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్ శ్రీమతి బానోతు జ్యోతి కొండ ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు.అభివృద్ధి పనుల కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఎంపీ కి గ్రామ సమస్యలను వివరించి, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలని కోరారు.గ్రామంలోని పలు వార్డుల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా 20 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని కొత్త బోర్‌వెల్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ బానోతుజ్యోతి, సర్పంచ్ కొండ తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధుల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పోటు వెంకటేశ్వర్లు, షేక్ మేరా సాహెబ్, జరుపుల లావణ్య, తాళ్లూరి జ్యోతి, షేక్ మీరా సాహెబ్, షేక్ నౌషిన్, ఉప్పర శ్రీను, మరిదు శేషు, జరుపల శివకృష్ణ, షేక్ బాజీ, బండి వెంకటేశ్వర్లు గ్రామ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొని వినతి పత్రం అందజేశారు.

# ఎంపీ రామ సహాయ రాఘవరెడ్డికి స్వాగతం పలికిన డా. కోటా రాంబాబు



**మధిర (ది క్రైమ్ న్యూస్):** మధిర పర్యటనకు విచ్చేసిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి కి గురువారం నాడు కెవిఆర్ హాస్పిటల్ నందు స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు, పలువురు నాయకులు కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, సిద్ధినేనిగూడెం, సొసైటీ చైర్మన్ కటికల సీతారాంరెడ్డి రేమిడిచర్ల మాజీ సర్పంచ్ పురుషోత్తరాజు నాయకులు పాల్గొన్నారు.

# 72 ఎకరాల ప్రభుత్వ భూమి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి....

● ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు, రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శాసన సభ్యులు, సంక్షేమ శాఖ మంత్రి అదూరి లక్ష్మణ్ కుమార్ సమర్పించిన ఫిర్యాదు మేరకు ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి శివారు సర్వే నెం. 679లో జరిగిన చట్టవిరుద్ధ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16.05.2025న సమర్పించిన ఫిర్యాదుపై రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దపల్లి గారిని విచారణ అధికారిగా నియమించగా, వారు సమర్పించిన నివేదికలో సర్వే నెం. 679 మొత్తం 670.22 ఎకరాల ప్రభుత్వ పరంపోగు భూమి అని వెల్లడైనట్లు తెలిపారు. 1347 ఫాసలీ సంవత్సరంలో దేవి పెద్ద లచ్చిగా అనే వ్యక్తికి 72.03 ఎకరాల భూమిపై తాత్కాలిక సాగు అనుమతి మాత్రమే ఇచ్చినట్లు, ఎటువంటి అసైన్మెంట్ జరగలేదని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక అనుమతిని ఆసరాగా చేసుకుని వారి వారసులు అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆ భూములను తదుపరి 11 మంది ఇతరులకు చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్లు, పట్టా మార్పిడులు చేసినట్లు విచారణలో బయటపడినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంతరం వారి పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారిస్తూ కార్యావర్తనములు నెం. జు3/434/2026, తేదీ 27.04.2026 ద్వారా సమాచారం అందజేసి, 72.03 ఎకరాల భూమిని ప్రభుత్వ ఖాతాకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. తదనంతరం ఆ భూమిని తహశీల్దార్, ధర్మారం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉన్నా, అక్రమ రిజిస్ట్రేషన్లు లేదా పట్టా మార్పిడులు చేసుకుని ఉన్నా, ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఉన్నా స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# మార్కెట్ కమిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం

● రైతులకు సేవ చేయడం గొప్ప అవకాశం ● కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య




**కరీంనగర్ టౌన్, మే7(ది క్రైమ్ న్యూస్):** రైతులకు సేవ చేసే గొప్ప అవకాశం రావడం అదృష్టమని నిరంతరం అన్నదాతకు అండగా నిలిచి అభివృద్ధికి తోడ్పడుతామని కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో గురువారం సాయంత్రంకరీంనగర్ డిసిసి కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య పాలకవర్గ సభ్యులతో సభ్యులతో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ మార్కెట్ కమిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పాలకవర్గం నియమకంతో పాటు తనకు చైర్మన్ గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాజ్యసభ సభ్యుడు వేము నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాసు చింతకుంట విజయ రమణారావు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తో పాటు సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి కాంగ్రెస్ కార్పోరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ తో పాటు మాజీ ఎమ్మెల్యేలు ఆరేపల్లి మోహన్ కోడూరు సత్యనారాయణ గౌడ్ ముఖ్య నేతలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం పెద్ద బాధ్యత అప్పగించిందని రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

24 గంటల పాటు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. తాను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని రైతుల కష్టాలు తెలుసయు అని వారికి అండగా ఉంటామని తెలిపారు. పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించే విషయంలో ధాన్యం కొనుగోలు విషయంలో అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఏ ఇబ్బంది రాకుండా చూసుకుంటామని ఆకుల నరసయ్య తెలిపారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచనలు సలహాల మేరకు మార్కెట్ కమిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మార్కెట్ కమిటీ ని ఆదర్శంగా తయారు చేస్తామని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని వారి అడుగుజాడల్లో తమ పాలకవర్గం నడుస్తుందని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంజాల శ్రీనివాస్ గౌడ్, బోనాల శ్రీనివాస్, మీసాల శంకర్ రావణ వేణి సంపత్, మాలోతు మాలతి, శివనాథుని వెంకటేశ్వర్లు పల్లా శివకుమార్, కార్పొరేటర్లు భాస్కర్ నాయక్ కల్లేపల్లి శారద బాలరాజు, ఆకుల నందిని ఉదయ్, గంట శ్రీనివాస్, కాంతాల జగన్ రెడ్డి, ఇక్రమ్ సికిందర్, కాంగ్రెస్ నాయకులు ఎన్నం రజిత రెడ్డి అర్ష మల్లేశం పెద్దపల్లి రవీందర్ గడ్డం విలాస్ రెడ్డి వేల్పుల వెంకటేష్ సరిల్ల రతన్ రాజు గండి రాజేశ్వర్ గండి శ్యామ్ కాసారపు కిరణ్ కుమార్ పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఎంపీ రామ సహాయ రాఘవరెడ్డి

● గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనే ప్రభుత్వ లక్ష్యం

● సంక్షేమానికి అన్ని ప్రాంతాలు సమానా అభివృద్ధి



**మధిర ప్రతినిధి మే 7 (ది క్రైమ్ న్యూస్):** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గురువారం ఆయన మధిర మండలంలో గురువారం నాడు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రూ.52లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు కేటాయించే నిధుల్లో అత్యధిక భాగాన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి కేటాయిస్తానని ప్రకటించారు. వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మధిర మండలంలో పర్యటించి వంగవీడులో రూ.5 లక్షలు, నిధనపురంలో 5 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించగా, సిరిపురంలో రూ.5 లక్షలు మరియు రాయపట్నంలో 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు మొత్తం 12 ప్రాంతాల్లో సుమారు రూ. 52 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పల్లెల్లో ప్రగతి పరుగులకు బాటలు వేశారు. అనంతరం వంగవీడు గ్రామంలో ఇటీవల నీటిలో మునిగి చనిపోయిన చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా. కోట రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పిఎసిసి చైర్మన్ కటికల సీతారామిరెడ్డి, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, దేవిశెట్టి రంగారావు, టి ఏ సి మెంబర్ ఉమ్మినేని కృష్ణ, అమరవాది సత్యనారాయణరెడ్డి, కర్నాటి రామారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, ఎర్రగుంట రమేష్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, అద్దంకి రవికుమార్, గొల్ల ఉద్దండయ్య, దుంప వెంకటేశ్వర్ రెడ్డి, ఐలూరి జనార్దన్ రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, అక్కినపల్లి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి బాలకృష్ణ, ఆయా గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోంది

● ప్రశ్నించిన కేటీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోంది ● కేంద్రంలో అధికారంలో 8 మంది ఎంపీలు ఉన్న అభివృద్ధి నిధుల విషయంలో విఫలమయ్యారు ● కాంగ్రెస్ ప్రభుత్వం విచారణల పేరుతో కాలయాపన చేస్తుంది ● పరిపాలన చేతకాక కేసుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ● రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తోందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫలమై ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై నమోదు చేస్తున్న కేసులు పూర్తిగా రాజకీయ కక్షసాధింపులో భాగమేనని అన్నారు. ప్రజల తరపున మాట్లాడుతున్న నాయకులను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని, రాజకీయ విలువలను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం విమర్శలను తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం దురదృష్టకరమని అన్నారు. మొన్నటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఇప్పుడు విద్యుత్ అంశంపై సీబీఐ విచారణ పేరుతో మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ అంశాలను తెరపైకి తీసుకువస్తోందని పేర్కొన్నారు. రైతుల సమస్యలు, నిరుద్యోగ సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తే కేటీఆర్పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ అభివృద్ధి, నిధుల విషయంలో మాట్లాడటంలో విఫలమయ్యారని కోరుకంటి చందర్ విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతకావడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా వెనుకబడి పోయిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్లపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగుతోందని, నిరంకుశ విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని కోరుకంటి చందర్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ కాలం గడుపుతోందని విమర్శించారు. ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వం ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో కార్పొరేటర్ మేకల సమ్మయ్య, నారాయణదాసు మారుతీ, మురళీధర్ రావు, నూతి తిరుపతి, తోకల రమేష్, కవిత, సరోజినీ, వకుళ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో వెంకటేశ్వర్లు






**మధిర ప్రతినిధి మే 7(ది క్రైమ్ న్యూస్):** మధిర మండలంలోని మహదేవపురం గ్రామం లో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వారి ఆధ్వర్యంలో గురువారం నాడు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినారు. వాసిరెడ్డి కృష్ణమోహన్ ,మాధురి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మధిర ఎండిఓ వెంకటేశ్వర్లు పుతుశీబాక సుభాష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించినారు. ఈ చలివేంద్రాన్ని ఇల్లూరు రాయపట్నం రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోగలరని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రంజిత్ కుమార్, పుతుంబాక హనుమంతరావు ,లత, కోకిల, చావ కనకమ్మ, బట్ట లింగయ్య, మురళి యాదవ్, నాగయ్య యాదవ్, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న జగిత్యాల డిఎస్పీ పురుషోత్తం రెడ్డి





**ధర్మపురి, మే 8, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన జగిత్యాల డిఎస్పీ పురుషోత్తం రెడ్డి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. వీరికి ముందుగా దేవస్థాన సాంప్రదాయం ప్రకారం సాదరంగా స్వాగతం పలికిన పిదప వేద పండితులు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థానం పక్షాన శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రపటం దేవస్థాన సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్ ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు నంబి నరసింహ మూర్తి, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామ్ నరసింహారెడ్డి, మరియు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# వివాదాల్లో ఉన్న మిల్లుకు ధాన్యం కేటాయింపులు ..

## - బాధ్యులపై చర్యలు తీసుకోవాలి - మిల్లు భాగస్వామి ఎల్లెంకి సుధాకర్ డిమాండ్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలం పెద్దబొంకూరులోని సాయి గణేష్ ఇండస్ట్రీస్‌లో నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయిస్తున్న అధికారులపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ మిల్లు భాగస్వామి ఎల్లెంకి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకరుల సమావేశంలో ఎల్లెంకి సుధాకర్ మాట్లాడుతూ తమ మిల్లులో నెలకొన్న వివాదాల గురించి అధికారులకు ముందే వివరించినప్పటికీ పట్టించుకోకుండా ధాన్యం కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మిల్లులో మొత్తం తొమ్మిది మంది భాగస్వాములు ఉండగా, గత కొంతకాలంగా ఆర్థిక,వ్యాపార లావాదేవీలపై వివాదాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. మేనేజింగ్ పార్టనర్లుగా ఉన్న ఎల్లెంకి రవీందర్, ఎల్లెంకి మధుకర్ మరణించిన నేపథ్యంలో మిల్లుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను నిలిపివేయడం జరిగిందని తెలిపారు. అయితే మరో భాగస్వామి ఎల్లెంకి దివాకర్ ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను,మిగతా భాగస్వాములను మోసం చేస్తూ మిల్లును నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లుగా భాగస్వామ్య ఒప్పందాలను ఉల్లంఘిస్తూ లాభాల్లో వాటా ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ పార్టనర్‌షిప్ చట్టం ప్రకారం భాగస్వాములందరి అంగీకారం లేకుండా ఎలాంటి ధాన్యం కేటాయింపు ఒప్పందాలు జరగకూడదని, కానీ పౌర సరఫరాల శాఖ అధికారులు దివాకర్‌తో కుమ్మక్కైనిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ఈ యాసంగి సీజన్‌లో కూడా మిల్లుకు ధాన్యం ఇవ్వవద్దని ఏప్రిల్ నెలాఖరులో జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, మళ్ళీ అదే మిల్లుకు ధాన్యం కేటాయించడం శోచనీయమని అన్నారు. తమకు తెలియకుండా కేటాయించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకుని ప్రభుత్వానికి సీఎంఆర్ ఎగవేస్తే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. సాధారణంగా మిల్లర్లు ఎగవేతకు పాల్పడితే భాగస్వాములందరిపై క్రిమినల్ కేసులు పెడతారని, ఇవన్నీ తెలిసి కూడా అధికారులు అక్రమంగా ధాన్యం కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుధాకర్ కోరారు.

# రైతు (బంధు) భరోసా... ఓ స్త్రీ రేపు రా...

- ఖాతాల్లో డబ్బుల జాడ లేదు
- ప్రకటనల్లో మాత్రం పరవళ్లు
- యాసంగి ముగిసినా రైతు భరోసా మాత్రం దారిలోనే!
- రైతన్నల ఎదురు చూపులు
- వాయిదాల రాజకీయాలు!

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో రైతు భరోసా పరిస్థితి చూస్తుంటే సుమారు మూడు దశాబ్దాల క్రితం గ్రామాల్లో వైరల్ అయిన "ఓ స్త్రీ రేపు రా" వాక్యం మళ్లీ గుర్తుకు వస్తోందని రైతులు వ్యంగ్యంగామాట్లాడుకుంటున్నారు

ఒకప్పుడు ఓ మహిళా దయ్యం గ్రామాల్లో తిరుగుతోందని పుకార్లు వ్యాపించగా... ఇంటి గోడలపై "ఓ స్త్రీ రేపు రా" అని రాస్తే ఆ దయ్యం ఆ ఇంటికి రాదని నమ్మకం ఉండేది. నమ్మకమో మూడవ విశ్వాసమో తెలియదు గానీ ఆ పిశాచి రాలేదు ఎవరినీ పీక్కు తినలేదు. ఇప్పుడు రైతు భరోసా డబ్బుల పరిస్థితి కూడా అలాగే మారిందని రైతన్నలు మండిపడుతున్నారు. భరోసా డబ్బులు రావు... రైతుల బతుకులు మారవు అన్నట్టే ఉన్నదంటున్నారు. యాసంగి ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన డబ్బులు... వాయిదాల మీద వాయిదాలు పడుతూ రైతుల్ని మోసం చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. డిసెంబర్‌లో ఇస్తామని చెప్పి... జనవరి, ఫిబ్రవరి అంటూ నెట్టుకొచ్చి... ఇప్పుడు ఏప్రిల్ ముగిసినా రైతుల ఖాతాల్లో పడకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శిస్తున్నారు.

పంట వేసేటప్పుడు కనిపించని భరోసా... పోస్టర్లలో మాత్రం పరవళ్లు తొక్కుతున్నదంటున్నారు. రైతుకు అవసరం ఉన్న సమయంలో సహాయం అందకపోతే ఆ పథకం పేరుకే పరిమితమవుతుందని రైతులు అంటున్నారు. విత్తనాలు కొనాలి... ఎరువులు తెచ్చుకోవాలి... కూలీలకు డబ్బులు ఇవ్వాలి... అప్పులు తీర్చాలి... ఇలాంటి అత్యవసర సమయాల్లో రైతు భరోసా అందకపోవడంతో రైతన్నలు మళ్లీ అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మాత్రం ప్రతి సభలో రైతు సంక్షేమం అంటూ, రైతును రాజును చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ... రైతు భరోసా విషయంలో మాత్రం "రేపు... ఎల్లుండి..." అంటూ కాలయాపన చేస్తోందని మండిపడుతున్నారు. రోహిణి కార్తె వస్తోంది... భరోసా మాత్రం రాకపోతోంది.ఇంకో 15 రోజుల్లో రోహిణి కార్తె ప్రవేశంతో వానకాలం సీజన్ మొదలవుతుంది.

యాసంగి డబ్బులకే దిక్కు లేకుంటే... వానకాలం పెట్టుబడులకు రైతులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు.

నిన్నటి సీజన్ డబ్బులే రాలేదు... రేపటి పంట ఎలా వేయాలి? అంటూ రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మళ్లీ వానాకాలం వచ్చినా అదే "ఓ స్త్రీ రేపు రా" కథ పునరావృతమవుతుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు డబ్బులు తేదీలు చెప్పకుండానే ఖాతాల్లో జమయ్యేవని గుర్తుచేసుకుంటున్న




రైతులు... ఇప్పుడు మాత్రం ప్రతి విడతకు ప్రకటనలు, ప్రెస్ మీట్లు, వాయిదాలే తప్ప డబ్బులు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. రైతు భరోసా పేరుతో రైతులను ఆశల్లో తేల్చి ... చివరకు నిరాశలో ముంచేస్తున్నారని మండిపడుతున్నారు. "రైతు భరోసా" అనే పేరు పెట్టి... రైతుకు భరోసా లేకుండా చేయడం దురదృష్టకరమని అంటున్నారు."రైతు ఓటు వేయగానే అవసరం... రైతు కష్టాలు మాత్రం ఎవరికీ కనిపించవా అనే ప్రశ్న సర్వసాధారణంగా వినబడుతున్నది. పంట పండితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిలబడుతుంది. కానీ రైతు కష్టకాలంలో ప్రభుత్వం చేయూత ఇవ్వాల్సింది పోయి... వాయిదాల రాజకీయాలతో కాలం గడపడం రైతాంగాన్ని అవమానించడమేనని కన్నెర్ర చేస్తున్నారు. ఒకప్పుడు గోడలపై "ఓ స్త్రీ రేపు రా" అని రాసేవారు... ఇప్పుడు రైతుల మనసుల్లో మాత్రం ఒకటే మాట తిరుగుతోంది.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞం ప్రారంభం

**కరీంనగర్ టౌన్, మే7(ది క్రైమ్ న్యూస్):** భక్తితో సమాజంలో మెదలాలని తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వారి పరివారంతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో వారి సారథ్యంలో బ్రహ్మశ్రీ డా.గర్రెపల్లి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహింపబడేటువంటి సుందరకాండ ప్రవచన జ్ఞాన యజ్ఞాన్ని వేడుకగా సాంప్రదాయబద్ధంగా శ్రీరాముడికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణంలోని సుందరకాండ కు ప్రత్యేకత ఉన్నదని మరియు రామాయణం యొక్క విశిష్టతను తెలియపరచినటువంటి సుందరకాండని ప్రతి ఒక్కరూ పట్టించాలని మరియు తెలుసుకోవాలని వారు చెప్పారు. వాల్మీకి మహర్షి రచించినటువంటి సుందరకాండ ద్వారా రామాయణం మొత్తం తెలుసుకోగలుగుతామని, సీతను కనుగొనేందుకు హనుమంతుడు చేసినటువంటి ప్రయత్నాలను చాలా చక్కగా తెలుసుకోవచ్చని వారు చెప్పారు.సుమారు 2000 శ్లోకాలు కలిగినటువంటి సుందరకాండలో అత్యద్భుతంగా విషయాలు తెలపడం జరిగిందని వారు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా విచ్చేసినటువంటి నగరపాలక సంస్థ మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సుందరకాండ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషదాయకమని మరియు ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని భక్తి భావంతో మెదడాలని మరియు తోటి వారికి సహాయపడాలని సూచించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయతను, ఓపికను పెంపొందించుకొని అభివృద్ధి వైపు పయనించాలని వారు చెప్పారు.మరో ఆత్మీయ అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ హనుమంతుడు సకల బలశాలని, రాముని కొలిచినటువంటి తీరు నేటికీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని వారు



చెప్పారు. సుందరకాండలోని విషయాల ద్వారా రామాయణం యొక్క ప్రాముఖ్యతను మనం తెలుసుకోగలుగుతామని వారు చెప్పారు. హనుమంతుడు అంకితభావానికి నిర్వచనమని మరియు భక్తి భావానికి స్ఫూర్తిదాయకమని వారు చెప్పారు.ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ వొంటల సత్యనారాయణ రెడ్డి, పలువురు ఆలయాల కమిటీల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవచనం అనంతరం పాల్గొన్న వారందరికీ తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేసినటువంటి భజనలు భక్తి భావాన్ని పెంపొందించాయి మరియు ప్రాంగణాన్ని చక్కగా అలంకరించి పండుగ వాతావరణం వెల్లివిరిసే విధంగా చేశారు.

## మే 10 పరేడ్ గ్రౌండ్స్ సభను విజయవంతం చేయాలి: రవికుమార్ యాదవ్

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మే 10న పరేడ్ గ్రౌండ్స్ లో జరగబోయే భారీ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం తుల్జాభవాని ఆలయం నుంచి మియాపూర్ న్యూ కాలనీ శివాలయం వరకు శేరిలింగంపల్లి అసెంబ్లీ భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు రావాలని పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, ప్రతి బస్తీ, ప్రతి అపార్ట్‌మెంట్ నుంచి





ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారని, తెలంగాణ ప్రజలపై ప్రేమతోనే సుమారు రూ.7,800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయబోతున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా "వికసిత్ భారత్ వికసిత్ తెలంగాణ" లక్ష్యంతోనే ప్రధాని తెలంగాణకు వస్తున్నారని, తెలంగాణ అభివృద్ధే ప్రధాని లక్ష్యమని పేర్కొన్నారు. మే 10న మధ్యాహ్నం 3 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభకు కులమతాలకు అతీతంగా అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రధానికి ఘన స్వాగతం పలికి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బైపాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, రామ్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, రాజు శెట్టి, వసంతి యాదవ్, అర్జున్, మల్లేష్ గౌడ్, రాజేష్, గణేష్, విష్ణుదత్, జితేందర్, రాము యాదవ్, నవీన్ రెడ్డి, మాన్యం యాదవ్, శ్రీనివాస్, రాము, ఆంజనేయులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి: పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన త్యాగస్ఫూర్తి, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. గురువారం మహావీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతిని పురస్కరించుకుని ఉషముళ్ళపూడి కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తిగా నిలిచారు. ఆయన జరిపిన సాయుధ పోరాటం భారత స్వాతంత్ర పోరాట చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సాధ్యమని నమ్మి, అదే పోరాటంలో ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. మన్యం ప్రాంత ప్రజల్లో విప్లవ భావాలను నాటుతూ, వారిని స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వాములను చేసిన మహానుభావుడు అల్లూరి అని తెలిపారు. రెండు సంవత్సరాల పాటు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన అల్లూరిని తుపాకులతో కాల్చి చంపుతున్న సమయంలో కూడా "వందేమాతరం" నినాదించిన మహనీయుడు అని గుర్తు చేశారు. యువత అల్లూరి అడుగుజాడల్లో నడుస్తూ దేశ సేవకు అంకితభావంతో



పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ యువజన సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి

### పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి అని, ఆపదలో ఉన్న పేద ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మందికి ప్రాణాధారంగా మారుతోందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన చిర్రా సాంబయ్యకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,50,000 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరంగా నిలుస్తోందన్నారు. ప్రజాక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంలా నిలుస్తోందని, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ఈ నిధి ద్వారా ఎంతో భరోసా లభిస్తోందన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి పెద్ద అండగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జంగయ్య యాదవ్, కాశినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు గ్రామానికి రక్షణ కవచం లాంటివి




**నల్లగొండ జిల్లా ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) మే 07:** నల్గొండ జిల్లా అనుముల మండలం మారేపల్లి గ్రామంలో గ్రామ భద్రత కోసం ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టడం అభినందనీయమని ఎస్సై సాయి ప్రశాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఆస్తి సంబంధిత నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లకు తాళాలు వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, గ్రామంలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అలాగే రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండడం, గ్రామంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా చోరీలు మరియు ఇతర నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. గ్రామ భద్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తే గ్రామాన్ని మరింత సురక్షితంగా మార్చుకోవచ్చని ఎస్సై సాయి ప్రశాంత్ అన్నారు.

## టెన్షన్‌లో ఉన్నారా.. ఇలా చేస్తే చాలా త్వరగా రిలాక్స్ అవ్వోచ్చు..

కాలంతో పరిగెడుతున్న జీవితాలు మనవి. ఎప్పుడూ ఉరుకులు పరుగుల జీవితాలే. కాస్త టైమ్ దొరికితే రిలాక్స్ అవ్వడానికి చూస్తాం. కానీ టైమే ఉండదు. దీనికి తోడు పని ఒత్తిడి.అందుకే చాలా మంది స్ట్రెస్ ఫీల్ అవ్వడం ఒక్కోసారి ఫ్రెస్టేట్ కూడా అవుతాం. దీంతో మానసిక ప్రశాంతత అనేది లేకుండా పోతుంది. స్ట్రెస్ కారణంగా ఏదో ఒక ఆరోగ్య సమస్య తలెత్తుతున్నాయి. అయితే వీటన్నిటికీ చెక్ పెట్టాలంటే ఇలాచేయండి అంటున్నారు నిపుణులు. ప్రతిరోజు రెగ్యులర్ పనులన్ని పూర్తయిపోయాక.. బాడీ అంతా అలసిపోయిన కానీ నిద్ర రాదు. వర్క్ టెన్షన్, ఒత్తిడి కారణం ఏదైనా రిలాక్స్ అవుదామని అనుకున్నా నిద్ర రాదు. ఇలాంటివిమనంరెగ్యులర్?గాగమనిస్తూఉంటాం.ఇలాఅనిపించినప్పుడు ఏమీఆలోచించకుండా కేవలం నేలపై పడుకోవలని నిపుణులు సూచిస్తున్నారు. యోగ చేసే వారికే కాదు.. చేయని వారికి తెలిసిన ఆసనం శవాసనం. నేల మీద వెల్లకిలా పడుకొని కాళ్లు చేతులను దూరంగా ఉంచడమే శవాసనం. ఈ శవాసనం చేయడం ద్వారా కండరాల మధ్య ఉన్న ఒత్తిడి తొలగిపోతుంది. ఆందోళనలో ఉన్నప్పుడు ఇలా నేలపై పడుకోవడం ద్వారా అసంకల్పిత ప్రతీకార చర్యను శాసించే నాడులు ఉత్తేజం చెంది.. ఒత్తిడి హార్మోన్లను నియంత్రిస్తాయి. దీంతో మనసు కుదటపడుతుంది అని అంటున్నారు నిపుణులు. నిత్యం యోగా, ఆసనాలు, ధ్యాసం లాంటివి చేసే వారికి ఇవన్నీ కొత్తేమీ కాదు. కానీ వీటిని రెగ్యులర్ గా చేయని వారికి కూడా ఈ శవాసనంచాలా చక్కగాఉపయోగపడుతుందిఅనిఅంటున్నారు నిపుణులు.

## గోర్లు కొరికే అలవాటు మీకు ఉందా..? అయితే తెలియకుండానే సమస్యల్లో..

దైనందిన జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు మనల్ని వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం.. అయితే, మన గోర్లలో ఎన్నో రకాల బ్యాక్టీరియా దాగుంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా మనం రోజు మొత్తంలో చేతులను చాలా సార్లు తాకుతాము. ముఖం నుంచి శరీరంలోని ఇతర భాగాల వరకు.. చేతులతో తాకుతాం.. అయితే, మీ అందమైన గోర్ల క్రింద లక్షలాది సూక్ష్మ జీవులు నివసిస్తాయన్న విషయం మీకు తెలుసా? తెలియకపోతే.. ఈ స్టోరీ చదవాల్సిందే.. మన గోర్ల కింద 32 రకాల బాక్టీరియాలు, 28 రకాల ఫంగస్‌లు ఉన్నాయని ఓ పరిశోధన వెల్లడించింది. ఈ పరిశోధన 2021లో జరిగింది. అమెరికన్ పాడియాట్రిక్ మెడికల్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురించారు. పరిశోధకులు గోర్ల కింద నుంచి శాంపిల్స్ తీసుకుని వాటిని టెక్నికల్ పద్ధతుల్లో విశ్లేషించగా అందులో 32 రకాల బ్యాక్టీరియా, 28 రకాల ఫంగస్ ఉన్నట్లు గుర్తించారు. వీటిలో, 50% నమూనాలలో బ్యాక్టీరియా మాత్రమే ఉంది. 6.3% మాత్రమే ఫంగస్‌ను కలిగి ఉంది. 43.7% బ్యాక్టీరియా, ఫంగస్‌ల మిశ్రమ సమూహాన్ని కలిగి ఉన్నట్లు అధ్యయనం తెలిపింది. కాలి గోర్లలో కూడా బ్యాక్టీరియా ఉంటుందని అధ్యయనం పేర్కొంది. అందుకే గోర్లు, చేతుల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకతపై నివేదికలు నొక్కిచెబుతున్నాయి. అన్నింటికంటే, మనం తినడానికి, ముక్కు తుడుచుకోవడానికి లేదా ఎవరినైనా కౌగిలించుకోవడానికి, ప్రతిదానికీ మన చేతులను ఉపయోగిస్తాము. అటువంటి పరిస్థితిలో, గోర్ల శుభ్రత మన అందానికే కాదు, మన ఆరోగ్యానికి కూడా చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు.. పరిశోధకులు ఏమి చెప్పారు? గోర్ల కింద ఉండే బ్యాక్టీరియా, ఫంగస్ సాధారణంగా హానిచేయనివని పరిశోధకులు చెబుతున్నారు. అయితే, కొన్ని సందర్భాల్లో, ఈ సూక్ష్మజీవులు బలహీనమైన ఇమ్యూనిటీ పవర్ ఉన్నవారిలో లేదా గోళ్లలో ఏదైనా గాయం లేదా ఇన్ఫెక్షన్ ఉన్నవారిలోకి ఈజీగా ప్రవేశిస్తాయి. ఇన్ఫెక్షన్ లక్షణాలు గోర్లు రంగు మారడం, వాపు, నొప్పి, చీము కారడం వంటివి ఉండవచ్చు. గోర్లను శుభ్రంగా ఉంచుకోవడం ఎలా? మీ చేతులు, గోర్లను సబ్బు, నీటితో కనీసం రోజుకు రెండుసార్లు కడగాలి. గోర్ల కింద మురికి పేరుకుపోకుండా ఉండేందుకు సాఫ్ట్ బ్రష్ ఉపయోగించండి. పొడవాటి గోర్లు ఉంచుకోవడం మానుకోండి. ఎందుకంటే వాటిలో ధూళి, క్రిములు సులభంగా పేరుకుపోతాయి. గోర్లను క్రమం తప్పకుండా కత్తిరించుకోండి.. గోళ్లను క్రమం తప్పకుండా కత్తిరించడానికి పదునైన సాధనాలను ఉపయోగించండి. నెయిల్ పెయింట్ వేయడానికి ముందు, తర్వాత మీ గోర్లను శుభ్రం చేసుకోండి. గోళ్లలో ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా ఏదైనా అసాధారణత కనిపించినట్లయితే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి.

# ప్రధాని మోడీ పర్యటనకు ఘన స్వాగతం

- తెలంగాణ అభివృద్ధిపై ప్రధాని దిశానిర్దేశం
- సభను విజయవంతం చేయాలని పిలుపు
- అడ్డగుంటపల్లి గోదావరిఖని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు
- బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి





**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అడ్డగుంటపల్లి గోదావరిఖని లోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 10వ తేదీన పరేడ్ గ్రౌండ్లో జరగనున్న భారీ బహిరంగ సభకు విచ్చేస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి స్వాగతం పలుకుతూ గురువారం రోజు ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తుండటం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని తెలిపారు. తెలంగాణ సమాజం ఆయన రాకను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించడం ప్రజలు మోడీ నాయకత్వంపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్‌లో తెలంగాణ కోసం తీసుకోబోయే కీలక నిర్ణయాలు, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల నేపథ్యంలో మోడీ పర్యటన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. ఈ సభకు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్తారని తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజలందరూ భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. రేపటి తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు దిశగా ప్రధాని నరేంద్ర మోడీ దిశానిర్దేశం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, సిలారపు కళ్యాణ్ మదరబోయిన రాకేష్, హనుమాన్ల వెంకటేష్,దామోదర అయ్యగారు, సూర్యదేవర జ్యోతి, పల్లే రాణి, శమంతకమణి, శైలజా, వినయ్, సాయి, బిన్న, బంటి, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో అధిక ధరలకు స్టాంప్ పేపర్‌లను అమ్ముతున్న స్టాంప్ వెండర్ల చర్యలు తీసుకోవాలని డిమాండ్

- సబ్ రిజిస్ట్రార్ తిరుపతి నాయక్ కి వినతి పత్రం ఇచ్చిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్

**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖనిలో స్టాంప్ పేపేర్లు ఎం.ఆర్.పి రెట్ల కంటే అధికంగా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ కు ఇచ్చిన వినతి పత్రం లో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. గురువారం సబ్ రిజిస్ట్రార్ కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. స్టాంప్ పేపర్లు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నారని, రుణాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్, స్థిరాస్తి పంపకాలు, భూముల కొనుగోళ్లు, విద్యార్థుల ఉపకార వేతనాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అఫిడవిట్ తయారీ, ఇతర క్రయవిక్రయాల కోసం నాన్ జ్యుడీషియల్ పేపర్లు ప్రజలకు నిత్యం అవసరమౌతాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగాల నోటిఫికేషన్లు వెలువడుతుండటంతో అభ్యర్థుల ఆదాయ ధ్రువీకరణపత్రంతో పాటు ఇతర అవసరాలకు స్టాంపు పేపర్లు తప్పనిసరి చేయడం తో దీన్ని ఆసరాగా చేసుకొని విక్రయదారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి ఆర్థిక దోపిడీ కి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇట్టి అక్రమ విక్రయాలపై అధికారుల అజమాయిషీ లేకపోవడంతో వారు చెప్పిన రేటుకు వినియోగదారులు స్టాంప్ పేపర్ లు కొనుగోలు చేయడం తప్పడం లేదని ఆయన అన్నారు. గోదావరిఖని ప్రాంతంలోని లక్ష్మి నగర్ లో 20, 50, 100 విలువైన స్టాంపు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్ మీద 30 నుంచి గరిష్ఠంగా 50 శాతం అధికంగా వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎందుకు అధికంగా వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే అవసరం ఉంటే తీసుకోండి లేకుంటే వెళ్ళండి అనే సమాధానాలు చెప్తుంటే గత్యంతరం లేక ఎక్కువ డబ్బులకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. స్టాంపు వెండర్లు తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇండెంట్ పెట్టి స్టాంపు పేపర్లు కొనుగోలు చేస్తుంటారని , ప్రభుత్వం వీటి విలువ ఆధారంగా విక్రయాలపై అయిదు శాతం కమీషన్ ను కొనుగోలు సమయంలో మినహాయింపునిస్తోంది. కానీ అసలు ధరకు అదనంగా తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే కొరత ఉందంటూ వెండర్స్ బుకాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నిబంధనలను మేరకు విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని , జిల్లాలో సంబంధిత అధికారుల తనిఖీలు కూడా కరువయ్యాయని ఆయన అన్నారు. పలువురు స్టాంపుల విక్రయదారులు నిబంధనలకు విరుద్ధంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులపై ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ 100 రూపాయల స్టాంపు పేపరుకు 150 రూపాయలకు, 50 రూపాయల దానికి 80 రూపాయలకు 20 రూపాయలు ఉన్న దానిని 30 రూపాయలకు విక్రయిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకవడం బాధాకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వారి పై కఠినమైన చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని, ముఖ్యంగా ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం, స్టాంప్ వెండర్లు ప్రభుత్వ విధులను నిర్వర్తిస్తున్నందున వారిని "ప్రజా సేవకులు గా పరిగణించాలని, దీనివల్ల వారు అధిక ధరలు వసూలు చేస్తే కేవలం లైసెన్స్ రద్దు మాత్రమే కాకుండా, అవినీతి నిరోధక చట్టం కింద కూడా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే తీసుకునే చర్యలు లైసెన్స్ రద్దు, స్టాంప్ చట్టం నిబంధనలను ఉల్లంఘించినందుకు వెండర్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేస్తారని, క్రిమినల్ కేసులు, సెక్షన్ 420 (మోసం) ఇతర సంబంధిత స్టాంప్ చట్టాల కింద కేసులు నమోదు చేయబడతాయని జరిమానాలు, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినందుకు లేదా ప్రజలను మోసం చేసినందుకు భారీగా జరిమానాలు కఠిన మైన చట్టాలు ఉన్నప్పటికీ సంబంధించిన అధికారులు స్పందించకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా స్పందించి ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రాయిస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాయకులు లెనిన్, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.







# గుండెకు మేలు చేసే ఉల్లి కాడలు..

## రక్తప్రసరణ సజావుగా సాగాలంటే వీటిని తినాల్సిందే




ఉల్లిపాయలో అనేక సుగుగుణాలు ఉంటాయి. అందుకే ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే నానుడి ప్రజాజీవనంలో స్థిరపడి పోయింది. ఉల్లిపాయలే కాదు ఉల్లి కాడలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతి మార్కెట్‌లో ఉల్లి కాడలు తక్కువ ధరకే లభ్యమవుతుంటాయి. ఉల్లి కాడలను ఇతర కూరగాయలతో కూడా జోడించి వంటలు చేయొచ్చు. ఆకర్షణీయంగా కనిపించడమేకాకుండా రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఉల్లి కాడలు హృద్రోగులకు, వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఉల్లి కాడల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. దీన్ని కూరలో వేసుకుని తింటే గుండె జబ్బులు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే ఉల్లి కాడల్లో ఉండే క్వెర్సెటిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. అలాగే గుండె జబ్బుల వంటి తీవ్రమైన సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. ఇందులో విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ ధమనులను ఆరోగ్యంగా ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఉల్లి కాడలను తినడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అంటే, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే, దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో అధికంగా సల్ఫర్ ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు శరీర నొప్పిని తగ్గిస్తాయి. నిత్యం ఉల్లి కాడలను ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# అంత డేంజరా..? ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!



సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.

# నేలపై పడుకుంటే ఇన్ని లాభాలా..? తెలిస్తే బెడ్‌కు గుడ్ బై చెప్పేస్తారు..!



కాలం మారింది.. దాంతో పాటుగానే ప్రజల జీవన విధానాలు మారిపోతున్నాయి. సౌకర్యాల విషయానికి వస్తే చాలా మంది ప్రజలు లగ్జరీ లైఫ్ కోసం పరుగులు పెడుతున్నారు.కానీ నేటికీ నేలపై పడుకునే పాత సంప్రదాయం ఇప్పటికీ సరైనదని మరోసారి నిరూపించబడింది ఈ ఆధునిక యుగంలో అందరూ మంచాలు, సుతిమెత్తటి బెడ్‌లను వాడుతున్నారు. కానీ, అలాంటి మంచాన్ని వదిలి నేలపై పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..? ఆ లాభాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేలపై పడుకోవడం వల్ల కలిగే అసంఖ్యాక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేల మీద పడుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం: మనస్తత్వవేత్తలు నేలపై పడుకోవడం వల్ల శరీరం రిలాక్సేషన్, నేలతో అనుబంధం ఏర్పడుతుందని అంటున్నారు. నేలపై పడుకోవడం వల్ల శరీర భంగిమ సరైన రీతిలో ఉంటుంది. అదే బెడ్‌పై పడుకున్నప్పుడు మనం నిద్రించే సమయంలో కుంగి ఉంటాయి. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నేలపై పడుకోవడం వల్ల వెన్నెముక నిటారుగా ఉంటుంది. మనం నేలపై పడుకున్నప్పుడు మన శరీరం పూర్తిగా రిలాక్స్ అవుతుంది. మనం పూర్తి విశ్రాంతి తీసుకుంటాము. ఇది వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకునేందుకు పిల్లోను వాడుకోవచ్చు. నడుము భాగంలో పలుచని పిల్లోను పెట్టుకుని నిద్రించాలన్నది వైద్యుల సూచన. నేలపై పడుకోవడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు: నేలపై పడుకోవడం వల్ల మన శరీరానికి కావలసిన సహజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది మన వీపును నిటారుగా ఉంచుతుంది. కండరాలను రిలాక్స్ చేస్తుంది. మీరు ఫ్లాట్ ఫ్లోర్‌లో పడుకున్నప్పుడు, మీ మనస్సులోని ఆందోళనలు కూడా తగ్గుతాయి. నేటి బీజీ లైఫ్ అత్యధిక ఒత్తిడితో కూడిన యుగంలో నేలపై నిద్రపోవడం మనల్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది. భూమితో అనుసంధానం చేయడం ద్వారా మనం మరింత సమతుల్యత, ప్రశాంతతను పొందవచ్చు. నేలపై పడుకోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. అదే విధంగా నిద్రలో సహజ శరీర కదలిక ఉంటుంది. పరుపులు, దిండ్ల ఒత్తిడి ఉండదు. మంచి రక్త ప్రసరణ ఉంటుంది. వేసవిలో నేలపై పడుకోవడం వల్ల శరీరానికి కాస్త చల్లగా అనిపిస్తుంది. నేల చల్లదనానికి, శరీర ఉష్ణోగ్రత నెమ్మదిగా తగ్గిపోతుంది. దీనివల్ల మరింత గాఢంగా నిద్ర పోవచ్చు. అంతేకాదు, చాలా మంది ఆఫీసు, ఇంటి పనితో అలసిపోతుంటారు. బాడీ పెయిన్స్ తో బాధ పడుతుంటారు. ఆ పెయిన్స్ ఉన్న వారు బెడ్ కి గుడ్ బై చెప్పి నేల మీద పడుకోవడం అలవాటు చేసుకోండి. ఆ హాయిని మీరు ఆస్వాదిస్తారు.

# స్పూన్ నెయ్యిలో చిటికెడు మిరియాల పొడి కలిపి తీసుకుంటే.. ఆ సమస్యలు చిటికెలో మాయం!



నేటి కాలంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్యంతో బాధపడు తున్నారు. అస్థవ్యస్థమైన జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే దీర్ఘకాలిక వ్యాధుల భారీన పడుతున్నారు. దీంతో రోజూ రకరకాల మందులు తీసకుంటూ శరీరం ఆరోగ్యంగా ఉండేలా చూసుకుంటున్నారు. అయితే ఈ వంట గదిలో ఉండే ఈ రెండు పదార్థాలను కలిపి తింటే ఇకపై మందులు వేసుకోవల్సిన అవసరం ఉండదంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవేంటంటే.. నెయ్యి, నల్ల మిరియాలు. ఒక చెంచా నెయ్యి తీసుకుని, అందులో కొన్ని నల్ల మిరియాల పొడిని వేసుకుని బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత దీనిని తినాలి. ప్రతిరోజూ ఇలా ఒక చెంచా తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. నెయ్యి, నల్ల మిరియాలు శరీర రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. ఇది చాలా వ్యాధులను నయం చేయగల చక్కని ఇంటి నివారిణి. నెయ్యి, నల్ల మిరియాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. నెయ్యిలో ఉండే ఎ, ఇ, కె విటమిన్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కీళ్ల నొప్పులు వంటి సమస్యలు ఉన్నవారు రోజూ దీనిని రోజూ ఒక చెంచా చొప్పున తినాలి. కీళ్ల వాపు, నొప్పిని తగ్గించడంలో నెయ్యి సహాయపడుతుంది. నెయ్యి, మిరియాలు తింటే గుండెకు,కాలేయానికిమేలుచేస్తుంది.కాబట్టి మీరూ కాలేయసమస్యతో బాధపడుతున్నట్లయితే, ఈ హెూం రెమెడీని ప్రతిరోజూ తినవచ్చు. ఏడాది పొడవునా జలుబు, దగ్గు వంటి సమస్యలు ఉంటే నెయ్యి, నల్ల మిరియాల పొడి మిశ్రమం తింటే త్వరిత గతిన ఉపశమనం పొందుతారు. ఇది వాయుమార్గాన్ని శుభ్రంగా ఉంచుతుంది. ఫలితంగా ముక్కు బ్లాక్ అవకుండా సాఫీగా ఉంటుంది.

# కొత్త బెల్లం కంటే పాత బెల్లం వెయ్యిరెట్లు మంచిదట.. మీరూ తినండి ఎన్ని లాభాలో!

తాజా బెల్లం తినడం చాలా మందికి ఇష్టం. అయితే కొత్త బెల్లం కంటే పాత బెల్లం ఎక్కువ మేలు చేస్తుందని మీకు తెలుసా..? అవును.. ఆశ్చర్యంగా అనిపించినా ఇది పోషకాహార నిపుణులు చెబుతున్న మాట. నేటి నుంచి వంటగదిలో కొత్త బెల్లానికి బదులు పాత బెల్లాన్ని వాడటం ప్రారంభించండి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 1 నుండి 2 సంవత్సరాల కాలంపాటు నిల్వ చేసిన బెల్లం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. సుదీర్ఘ కాలంలో బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్, పోషక విలువలు పెరుగుతాయి. ఇది మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. కాబట్టి 1 నుంచి 2 సంవత్సరాలలోపు పాత బెల్లం తీసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులోని మొలాసిస్‌ను వివిధ పోషకాలను అందిస్తుంది. పాత బెల్లం దుకాణాల్లో దొరుకుతుంది. కానీ దీని ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. బెల్లం అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు బెల్లంలో పుష్కలంగా ఉంటాయి. బెల్లం మన జీర్ణక్రియను అనేక విధాలుగా మెరుగుపరుస్తుంది. బెల్లంలో అనేక రకాల ఎంజైమ్‌లు, ఫైబర్‌లు ఉంటాయి. ఇవి ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడతాయి. బెల్లం ఎముకల ఆరోగ్యానికి కావల్సిన ముఖ్యమైన కాల్షియం, ఫాస్పరస్ వంటి ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది.



# ‘టాప్’ లేపిన సన్ రైజర్స్..

ఐపీఎల్ 2026 సీజన్లో మాజీ చాంపియన్ సన్ రైజర్స్ హైదరాబాద్ దుమ్ము రేపింది. బుధవారం టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 33 పరుగులతో ఘనవిజయం సాధించింది. దీంతో తొలిసారిగా టోర్నీలో టాప్ ప్లేస్ ను దక్కించుకుంది. అంతకుముందు స్థానిక హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 235 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ స్టన్నింగ్ ఫిఫ్టీ (43 బంతుల్లో 69, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచి, ఆరెంజ్ క్యాప్ ను సొంతం చేసుకున్నాడు. అనంతరం ఛేజింగ్ లో పంజాబ్ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఓవర్లన్నీ ఆడిన పంజాబ్ .. 7 వికెట్లకు 202 పరుగులు చేసి, ఓడిపోయింది. వన్ డౌన్ బ్యాటర్ కూపర్ కాన్లీ సూపర్బ్ సెంచరీ (59 బంతుల్లో 107 నాటౌట్, 7 ఫోర్లు, 8 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో పాట్ కమిన్స్, శివాంగ్ కుమార్ కు రెండేసి వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఏడు విజయాలతో టేబుల్ టాప్ ప్లేస్ ను సన్ రైజర్స్ దక్కించుకుంది. మరోవైపు పంజాబ్ కు ఇది వరుసగా మూడో ఓటమి కావడం విశేషం. గురువారం జరిగే మ్యాచ్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో లక్నో సూపర్ జెయింట్స్ తలపడనుంది. భారీ స్కోరుతో బరిలోకి దిగిన పంజాబ్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది.

సూపర్ ఫామ్ లో ఉన్న ప్రియాంశ్ ఆర్య (1) తొలి




ఓవర్లోనే ఔట్ కావడం షాకింగ్ గా మారింది. తర్వాతి ఓవర్ లోనే మరో విధ్వంసక ఓపెనర్ ప్రభ్ సి... సింగ్ (3) కూడా వెనుదిరగడంతో పంజాబ్ ...టుకోలేకపోయింది. ఈ సీజన్‌లో ...ద్దరూ మెరుపు ఆరంభాలను ఇస్తూ, రాణిస్తున్నారు. అయితే వరుస బంతుల్లో వీరిద్దరూ వెనుదిరగడంతో పంజాబ్ కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5)ను ఇషాన్ మలింగా బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత మార్కస్ స్టొయినిస్ (28) వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. అయితే శివాంగ్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించి, కీపర్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. దీంతో పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. మరోవైపు నాలుగు వికెట్లు పడినా, కాన్నోలీ ఏమాత్రం వెనుకంజ వేయలేదు. చకచకా పరుగులు సాధిస్తూ, వేగంగా ఆడాడు. దీంతో పవర్ ప్లేలో 57 పరుగులు వచ్చాయి. సూర్యాంశ్ షెడ్గే (25) తనకు మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ ఐదో వికెట్ కు 47 పరుగులు జోడించడంతో పంజాబ్ కాస్త కోలుకున్నట్లు అయింది. ఈ దశలో 34 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన కాన్నోలీ, అన్ స్టాపబుల్ గా అనిపించాడు. మరోవైపు షెడ్గే ఔటైన తర్వాత శశాంక్ సింగ్ (4), మార్కో యన్సెన్ (19) విఫలమైనా తను మాత్రం చివరికంటా నిలిచాడు. ఈక్రమంలో 57 బంతుల్లో సెంచరీని కంప్లీట్ చేసుకున్నాడు. అతని పోరాటంతో పంజాబ్ రన్ రేట్ పడిపోకుండా ఓటమి పాలైంది. ఇక చక్కగా బౌలింగ్ చేసిన సన్ కెప్టెన్ పాట్ కమిన్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# నేను తప్పు చేసిన మాట నిజమే

## డేవిడ్ వార్నర్ కీలక వ్యాఖ్యలు

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తన తప్పును ఒప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. గత నెలలో సిడ్నీలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో వార్నర్ పట్టుబడ్డారు. ఆ సమయంలో సేవించిన మద్యం మోతాదు చట్టప్రకారం ఉండాల్సిన సాధారణ పరిమితి కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. ఈ కేసుకు సంబంధించి వేవర్లీ లోకల్ కోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, వార్నర్ హాజరు కాకపోవడంతో కోర్టు దీనిని జూన్ నెలకు వాయిదా వేసింది.వార్నర్ తరపు న్యాయవాది బాబీ హిల్ ఈ విషయంపై స్పందిస్తూ తన క్లయింట్ చేసిన పనిని అతి బుద్ధిహీనమైన చర్యగా భావిస్తున్నారని మీడియాకు తెలిపారు. స్నేహితుని ఇంట్లో మూడు గ్లాసుల వైన్ తాగిన వార్నర్, ఉబర్(లో వెళ్లడానికి బదులుగా స్వయంగా కారు నడపాలని నిర్ణయించుకోవడం తప్పుడు నిర్ణయమని ఆయన అంగీకరించారు. అయితే పోలీసు స్టేషన్‌లో చేసిన రెండో శ్వాస పరీక్ష సమయంపై కొన్ని సాంకేతిక సందేహాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ నెలలో సిడ్నీలోని మారుబ్రా ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఒక వ్యాన్ దూరంగా ఆగిపోవడాన్ని వారు గమనించారు. ఆ వాహనాన్ని నడుపుతున్న వార్నర్‌కు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి అనంతరం స్టేషన్‌కు తరలించారు. అక్కడ చేసిన పరీక్షలో ఆయన రక్తంలో ఆల్కహాల్ కంటెంట్ 0.104గా నమోదైంది. సాధారణంగా 0.05 వరకు మాత్రమే అనుమతి ఉండగా, వార్నర్ అంతకు రెట్టింపు మోతాదులో ఉండటంతో పోలీసులు ఆయనపై ‘మిడిల్-రేంజ్ ్రాజూ’ కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై క్రికెట్ న్యూ సౌత్ వేల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ లీ జర్మన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ సంస్థ సురక్షితమైన డ్రైవింగ్‌కు ప్రాధాన్యత ఇస్తుందని ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. 2024లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వార్నర్, ఆస్ట్రేలియా జట్టుకు ఎన్నో అద్భుత విజయాలు అందించారు. ప్రస్తుతం ఆయన వివిధ దేశాల్లో ఫ్రాంఛైజ్ క్రికెట్ ఆడుతూ సిడ్నీ థండర్, కరాచీ కింగ్స్ వంటి జట్లకు నాయకత్వం వహిస్తున్నారు. స్థానిక చట్టాల ప్రకారం ఈ రకమైన నేరాలకు భారీ జరిమానాలు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు వంటి శిక్షలు ఉంటాయి. ఈ వివాదం మొదలైనప్పటి నుండి వార్నర్ నేరుగా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ, జూన్ నెలలో జరిగే విచారణలో ఈ కేసులో ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




# కమిన్స్‌కు భారీ ఆఫర్

సన్?రైజర్స్? కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ప్రస్తుతం ఐపీఎల్?లో బిజీగా ఉన్నాడు. గాయం కారణంగా కొన్ని నెలల విరామం తర్వాత బరిలోకి దిగిన కమిన్స్? బౌలింగ్?తోపాటు కెప్టెన్సీలో ఆకట్టుకుంటున్నాడు. అయితే ఐపీఎల్?లో ఆడుతుండగానే కమిన్స్?కు భారీ ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. అతడికి క్రికెట్ ఆస్ట్రేలియా బోర్డు రూ.113 కోట్లు ఆఫర్ చేసిందని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పేర్కొంది. రానున్న మూడేళ్లలో క్రికెట్?లో ఐసీసీ కీలక టోర్నమెంట్?లు ఉన్నాయి. వన్డే వరల్డ్?కప్, టీ20 ప్రపంచకప్, టెస్టు ఛాంపియన్?షిప్ లాంటి టోర్నీలు జరగాల్సి ఉన్నాయి. ఇదే సమయంలో కొన్నేళ్లుగా కమిన్స్ అన్ని ఫార్మాట్లలో కెప్టెన్?గా, ప్లేయర్?గా ఆకట్టుకుంటున్నాడు. ఇంటర్నేషనల్ క్రికెట్?తోపాటు, ఫ్రాంచైజీ లీగుల్లోనూ రాణిస్తున్నాడు. దీంతో అతడిని ఇంకొంతకాలం ఆస్ట్రేలియా జాతీయ జట్టులో కొనసాగించాలని ఆసీస్ క్రికెట్ బోర్డు భావిస్తుంది. ఈ క్రమంలోనే అతడికి లాంగ్ టర్మ్ కాంట్రాక్ట్ ఆఫర్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మూడేళ్ల కాలానికి 12 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.113 కోట్లు) భారీ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అంటే ఏడాదికి 4 మిలియన్ డాలర్లు. ఈ బిగ్ డీల్?తో కమిన్స్?తో మూడేళ్లకు అగ్రిమెంట్ చేసుకోవాలని ప్లాన్ చేస్తుందని సమాచారం. ఈ సమయంలో వన్డే, టీ20, టెస్టు మూడు ఫార్మాట్లలో ఆసీస్ జట్టు తరఫున తొలి ప్రాధాన్యంగా ఆడేలా ఒప్పందం చేసుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇది నిజమైతే క్రికెట్ వర్గాల్లో ఇదే భారీ డీల్ అవుతుంది! కమిన్స్?తోపాటు, మార్నస్ లబుషేన్, ట్రావిస్ హెడ్?తో కూడా ఇలాంటి అగ్రిమెంట్? చేసుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2024లో సన్?రైజర్స్ కెప్టెన్ అయిన తర్వాత కమిన్స్ ఐపీఎల్?లో తనదైన మార్క్ చూపిస్తున్నాడు. జట్టులో డేరింగ్ గేమ్ అప్రోచ్ తీసుకురావడంలో సక్సెస్ అయ్యాడు. అప్పట్నుంచి సన్?రైజర్స్ 200ం స్కోర్లు ఈజీగా నమోదు చేస్తోంది. ఇక ఇదే డాషింగ్ ఆటతీరుతో ఆ సీజన్?లో జట్టును కమిన్స్ ఫైనల్ చేర్చాడు. ఇక ఈ సీజన్?లోనూ అతడు ఆకట్టుకుంటున్నాడు. ఈ క్రమంలో ఐపీఎల్?లోని ఓ ఫ్రాంచైజీ అతడికి భారీ మొత్తంలో ఆఫర్ చేసిందని తెలిసింది. ఆస్ట్రేలియా జట్టును వదిలేసి, వరల్డ్?వైడ్?గా ఉన్న టీ20 లీగ్?ల్లో తమ ఫ్రాంచైజీ తరఫున ఆడేందుకు 6.6 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.62 కోట్లు) ఇచ్చేందుకు రెడీ అయ్యిందని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పేర్కొంది.ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆఫర్?తో ఆసీస్ బోర్డు అప్రమత్తమైనట్లు తెలిసింది. ఈక్రమంలోనే కమిన్స్?తో డీల్ కుదుర్చుకునేందుకు బోర్డు ప్రయత్నాలు చేస్తుందని తెలిసింది. అయితే గతంలో కొందమంది వెస్టిండీస్ స్టార్ ప్లేయర్లు జాతీయ జట్టును కాదని ఫ్రాంచైజీ క్రికెట్ ఆడేందుకు అగ్రిమెంట్లు చేసుకున్నారు. దీంతో విండీస్ జాతీయ జట్టు ఇబ్బందులు ఎదుర్కొంది. అందుకే తమకు ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఆసీస్ బోర్డు అప్రమత్తమైనట్లు సమాచారం!దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా హెడ్ జేమ్స్ అల్సోప్ప్ స్పందించారు. తమ జట్టులోని స్టార్ ప్లేయర్లు ఆర్థికపరమైన భద్రత, భారీ రెమ్యూనరేషన్స్?కు అర్హులేనని తెలిపారు. కానీ ఇలాంటి ఆఫర్ చేసినట్లు మాత్రం ఆయన చెప్పలేదు. ‘సంపాదించుకోవడానికి మా ప్లేయర్లకు హక్కు ఉంది. ఆస్ట్రేలియా కోసం మూడు ఫార్మాట్లలో అనేక అద్భుత ప్రదర్శన చేశారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగానే ఆటగాళ్ల విలువ కూడా పెరుగుతుంటుంది. కమిన్స్?, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్?లాంటి మూడు ఫార్మాట్ల ప్లేయర్లకు మంచి డిమాండ్ ఉంది’ అని ఆయన అన్నారు.


# క్లారిటీ లేకుంటే టాప్ ప్లేయర్స్ ఉన్నా వేస్టే: రిషభ్ పంత్

క్లారిటీ లేకుండా క్రికెట్‌లో రాణించడం కష్టమని లక్నో సూపర్ జెయింట్స్(్రూ+) కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. స్పష్టత లేనప్పుడు జట్టులో ఎంత పెద్ద ప్లేయర్లు ఉన్నా వృథానేనని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో లక్నో వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన రిషభ్ పంత్.. తమ జట్టును గాయాల బెడద వేధిస్తోందని తెలిపాడు. దాంతో తుది జట్టులో పలు మార్పులు చేశామని వెల్లడించాడు. ‘మా జట్టులో కొందరు ఆటగాళ్లకు గాయాలయ్యాయి. అందుకే ఇంగ్లిస్ స్థానంలో అర్షిన్ కుల్కర్ణి జట్టులోకి వచ్చాడు. ఇంగ్లిస్‌కు స్వల్ప గాయమైంది. మోహ్సిన్‌కు కూడా చిన్న గాయమైంది. దాంతో మణిమారన్ సిద్ధార్థ్ స్థానంలో షాబాజ్ అహ్మద్ బరిలోకి దిగాడు. మేం మరింత క్లారిటీతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాం. మేమంతా అగ్రశ్రేణి ఆటగాళ్లమని మాకు తెలుసు. కానీ కొన్నిసార్లు క్రికెట్‌లో స్పష్టత లోపించినప్పుడు ఇలా పరాజయాలు ఎదురవుతుంటాయి. కాబట్టి చాలా వరకు మేం స్పష్టత గురించి మాట్లాడుకుంటున్నాం. బ్యాటింగ్ ఆర్డర్‌లో కూడా కొన్ని మార్పులు ఉన్నాయి. కాబట్టి వీటిని పరిష్కరించి వచ్చే సీజన్ నాటికి సిద్ధమవుతామని ఆశిస్తున్నాం. టీ20 క్రికెట్‌లో స్థిరమైన వాతావరణం ఉండటం చాలా అవసరం. కానీ అదే సమయంలో మార్పులు అవసరమైనప్పుడు ఆ మార్పులు చేయగలగాలి. ఎందుకంటే ప్రతిసారీ ఒకే పని చేయడం వల్ల ఒకే రకమైన ఫలితం రాకపోవచ్చు. కాబట్టి కొన్నిసార్లు కొత్తగా ప్రయత్నించాలి. ముఖ్యంగా ప్రస్తుతం మేం ఉన్న స్థితిలో ప్రయోగాలు చేయడం తప్పేం కాదు. ఇది 180-190 స్కోరు వచ్చే వికెట్‌లా కనిపిస్తోంది. గతంలో జరిగిన చాలా మ్యాచ్‌ల కంటే




ఇది మెరుగైన వికెట్.’అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిచిన రజత్ పాటిదార్ బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. ‘చిన్నస్వామి స్టేడియం తరహాలో ప్రేక్షకుల గోల లేకపోయినా.. ఇప్పటికీ సందడిగానే ఉంది. ఇది గట్టి ఉపరితలం అని నేను భావిస్తున్నా. ఇది నల్ల రేగడి నేల పిచ్. పైగా ఇక్కడ గత 4-5 మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లు నమోదయ్యాయి. మేం ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోరుకు పరిమితం చేయడానికి ప్రయత్నిస్తాం.గత మ్యాచ్ తర్వాత మాకు సుదీర్ఘ విరామం లభించింది. అందరూ మంచి మానసిక స్థితిలో కనిపిస్తున్నారు. ఆరు ఏడు రోజుల కష్టపడి చేసిన శిక్షణ తర్వాత మేం మళ్లీ కలిశాం. నేను చెప్పినట్లుగా.. టోర్నీ ఆసాంతం అందరూ బాగా రాణిస్తున్నారు. మేం ఈ గేమ్ కోసం ఎదురుచూస్తున్నాం. మేం పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్నాం.’అని రిషభ్ పంత్ చెప్పుకొచ్చాడు.

# స్పోర్ట్స్



## తండ్రైన సూర్యకుమార్ యాదవ్

భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దంపతులు శుభవార్త చెప్పారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌కు ముంబై ఇండియన్స్‌కు చెందిన ఈ స్టార్ బ్యాటర్ తుదిజట్టు నుంచి పక్కకి తప్పుకోవడం పట్ల పెద్ద చర్చ జరిగింది. ఈ క్రమంలో ఆయన భార్య దేవిషా శెట్టిలకు పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిసి ముంబై ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. తన కుటుంబ అవసరాల కోసం సూర్యకుమార్ రాబోయే మ్యాచ్ నుంచి వైదొలగినట్లు తెలియడంతో ఫ్యాన్స్‌కు క్లారిటీ వచ్చింది. సూర్యకుమార్ కెరీర్ పరంగా చెప్పాలంటే 2026 ఎంతో గొప్పగా సాగింది. ఆయన కెప్టెన్సీలో టీమ్‌ఇండియా జట్టు టీ20 ప్రపంచకప్ లో విజేతగా నిలవగా.. ఇప్పుడు ఆయన భార్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో సూర్యకుమార్ యాదవ్ ఆనందం రెట్టింపు అయ్యింది. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సూర్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ రేసులో అతికష్టం మీద సాగుతోంది. 10 మ్యాచ్‌ల తర్వాత కేవలం ఆరు పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో ముంబై ఇండియన్స్ నిలిచింది. ఈ టీమ్ ప్లేఆఫ్స్‌కు చేరాలంటే ఆడే ఇకపై లీగ్‌లో ఆడాల్సిన ప్రతి మ్యాచ్ తప్పక గెలవడంతో పాటు నెట్ రన్‌రేట్ కూడా మెరుగ్గా ఉండాల్సిన అవసరం ఉంది.అతని వ్యక్తిగత ఫామ్ ఏమాత్రం సంతృప్తికరంగా లేనప్పటికీ.. ఈ ఆటగాడికి 2026 ఏడాది అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఎందుకంటే, దాదాపు రెండు నెలల క్రితం మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి, అతను కెప్టెన్‌గా వ్యవహరించి భారత్‌కు 2026 టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను అందించాడు. ఐపీఎల్ 2026లో తిరిగి ఫామ్‌లోకి రావాలని సూర్యకుమార్ ఆశిస్తున్నాడు. ఇప్పటివరకు జరిగిన 10 మ్యాచ్‌లలో అతను 19.50 సగటుతో, 145.52 స్ట్రైక్ రేట్‌తో కేవలం 195 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆరోగ్య సమస్యల కారణంగా రెండు మ్యాచ్‌లకు ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరమవ్వగా.. ఇప్పుడు సూర్య కుమార్ యాదవ్ కూడా ఆర్సీబీతో మ్యాచ్‌లో తప్పుకోవడంతో జట్టుకు జస్‌ప్రీత్ బుమ్రా లేదా రోహిత్ శర్మ కెప్టెన్సీ వ్యవహరించే అవకాశం ఉంది.

## చరిత్ర సృష్టించిన కనోలి

సన్?రైజర్స్?తో మ్యాచ్?లో పంజాబ్ కింగ్స్ ఓడిపోయినా ఆ జట్టు యువ సంచలనం కూపర్ కనోలి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్య ఛేదనలో మరో ఎండ్?లో సహకారం లేకున్నా పోరాటపటిమతో ఆత్మవిశ్వాసం ప్రదర్శించాడు. ఈ క్రమంలోనే శతకం బాదేశాడు. దీంతో కనోలి ఐపీఎల్?లో అద్భుతమైన రికార్డు నెలకొల్పాడు. అతడి తాజా సెంచరీతో 10ఏళ్ల రికార్డు బ్రేక్ అయ్యింది. 22 ఏళ్ల కనోలి ఈ మ్యాచ్?లో వన్ డౌన్?లో బ్యాటింగ్?కు దిగాడు. మొత్తం 59 బంతుల్లో 107 పరుగులు చేసి నాటౌట్?గా నిలిచాడు. ఇందులో 8 సిక్స్?లు1 7 ఫోర్లు ఉండడం విశేషం. దీంతో కనోలి 19ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో సెంచరీ నమోదు చేసిన అతిపిన్న విదేశీ ఆటగాడిగా అరుదైన రికార్డు కొట్టాడు. ఈ సెంచరీ నమోదు చేసే నాటికి కనోలి వయసు 22 ఏళ్ల 257 రోజులు. ఈ మ్యాచ్?కు ముందు ఈ రికార్డు సౌతాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డి కాక్ పేరిట ఉండేది. అతడు 2016లో దిల్లీ డేడ్?డెవిల్స్?కు ప్రాతినిధ్యం వహిస్తూ, ఆర్సీబీపై సెంచరీ బాదాడు. ఆ రోజుకి డికాక్ వయసు 23ఏళ్ల 122 రోజులు. గత 10ఏళ్లుగా ఈ రికార్డు అతడి పేరిటే కొనసాగుతూ వస్తోంది. తాజా మ్యాచ్?తో కనోలి ఆ రికార్డు బద్దలుకొట్టాడు.అలాగే ఈ మ్యాచ్?తో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డును కూడా కనోలి బ్రేక్ చేశాడు. ఐపీఎల్?లో పంజాబ్?కు ప్రాతినిధ్యం వహిస్తూ అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసిన రెండో బ్యాటర్?గా కనోలి నిలిచాడు. ఈ క్రమంలో అతడు క్రిస్ గేల్ (104 పరుగులు జం సన్?రైజర్స్, 2018లో) ను అధిగమించాడు. ఈ లిస్ట్?లో పాల్ పాల్థాటీ టాప్?లో ఉన్నాడు. అతడు 2011లో చెన్నై సూపర్ కింగ్స్?పై 120 రన్స్ చేశాడు. ఇక రెండో స్థానంలో కనోని ఉండగా, ఆ తర్వాత ఈ లిస్ట్?లో వరుసగా డేవిడ్ మిల్లర్ (101), హషీమ్ ఆమ్లా (100), మయంక్ అగర్వాల్ (100) ఉన్నారు.కాగా, పంజాబ్ కింగ్స్ తరఫున 22ఏళ్లకే సెంచరీ బాదిన రెండో బ్యాటర్?గా కనోలి నిలిచాడు. అతడి కంటే ముందు ప్రభ్?సిమ్రన్ సింగ్ ఈ ఫీట్ సాధించాడు. ప్రభ్?సిమ్రన్ 2023 ఎడిషన్?లో దిల్లీ క్యాపిటల్స్?పై సెంచరీ చేశాడు. అలాగే ఇదే ఏజ్?లో పంజాబ్ కింగ్స్? తరఫున సింగిల్ ఎడిషన్?లో అత్యధిక సిక్స్?లు బాదిన ఆటగాడిగానూ రికార్డు కొట్టాడు. ఈ మ్యాచ్?లో కనోలి 8 సిక్స్?లు బాదాడు. ఇదివరకు కూడా ఈ రికార్డు కనోలి పేరిటే ఉంది. ఇదే సీజన్?లో లఖ్?నవూతో మ్యాచ్?లో 7 సిక్స్?లు కొట్టాడు.

# విశ్వేజి




## ముప్పై ఏళ్లకే ముప్పు!

ఒకప్పుడు అరవై దాటితేనే దాడిచేసే గుండెపోటు.. ఇప్పుడు ముప్పై ఏళ్లకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఉరుకులు పరుగుల నేటి జీవితంలో.. యువతలోనూ ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్నది. ఇది.. దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. వెంటనే ప్రభావం చూపకుండా.. చాపకింద నీరులా ప్రమాదాన్ని పెంచుతున్నది. ఎలాంటి హెచ్చరికలు లేకుండానే.. నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నది. జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటే.. 'గుండె'కు అండ దొరుకుతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలోనూ 'ఒత్తిడి' మామూలు విషయంగా మారిపోయింది. నిద్రలేమి, వేళాపాళ లేని భోజనం, డిజిటల్ స్క్రీన్లకు గంటల తరబడి అతుక్కుపోవడం, పని ఒత్తిడి.. ఇవన్నీ యువత గుండెకు హాని కలిగిస్తున్నాయి. నైట్ డ్యూటీలు కూడా.. అగ్గికి ఆజ్యం పోస్తున్నాయి. రాత్రంతా మేల్కొని ఉండటంతోపాటు నిద్ర రాకుండా ఉండేందుకు టీ–కాఫీలను ఎక్కువగా ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇక ధూమపానం, మద్యంతోపాటు ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు కూడా తోడై.. గుండెకు చేటు చేస్తున్నాయి. ఫలితంగా.. శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ లాంటి హార్మోన్లు దారి తప్పుతున్నాయి. అన్నీ కలిసి హృదయ స్పందనల రేటును పెంచుతున్నాయి. ఇక రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి.. హృదయానికి హానికరంగా పరిణమిస్తున్నాయి... లక్షణాలు అంతంతే!

ఒత్తిడి లక్షణాలు అంత త్వరగా బయటపడవు. ముఖ్యంగా.. 30 %–% 40 ఏళ్లలోపు చాలామంది ఆరోగ్యంగా ఉన్నట్టే కనిపిస్తారు. ఇలాంటివారిలో హెచ్చరిక లక్షణాలు కూడా తక్కువగానే ఉంటాయి. అసౌకర్యంగా ఉండటం, అజీర్ణం, అసాధారణ అలసట వంటివి కనిపిస్తాయి. కానీ, వీటిని చాలామంది అంతగా పట్టించుకోరు. చిన్నచిన్న ఇబ్బందులుగానే భావిస్తారు. కానీ, గుండెపోటు రావడానికి ముందు.. కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. ఛాతీలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, వికారం–వాంతులతోపాటు అధికంగా చెమటలు పడతాయి. కొందరిలో తల తిరగడం, తీవ్రమైన అలసట కనిపిస్తుంది. వీటిని నిర్లక్ష్యం చేస్తే.. మరింత ప్రమాదకరంగా మారుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరి.. సమతుల ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 30 నిమిషాల వ్యాయామం, సరైన వేళల్లో నిద్రపోవడం, డిజిటల్ స్క్రీన్ల నుంచి విరామాలు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి భరోసా ఇవ్వొచ్చు. యోగా, ధ్యానంతో శరీరంతోపాటు మనసూ రీసెట్ అవుతుంది. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి. ఈసీజీ, కొలెస్ట్రాల్ టెస్ట్, బీపీ పరీక్షలు, ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. దీనివల్ల సమస్యను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. కరోనరీ క్యాల్షియం స్కోరింగ్, హై సెన్సిటివిటీ ట్రోపోనిన్ లాంటి పరీక్షలు గుండె సమస్యలను ప్రారంభంలోనే గుర్తించగలవు. ఇక స్మార్ట్‌వాచ్‌లూ హృదయ స్పందన రేటును ఎప్పటికప్పుడు చెబుతుంటాయి.

## చాట్ జీపీటీ చెప్పింది.. లక్షల అప్పు తీరింది!




చాట్ జీపీటీ మన అనుమానాలను తీరుస్తుందనే ఇన్నాళ్లూ విన్నాం. కానీ అప్పులనూ తీర్చేలా పనిచేస్తుందని తెలుసా?! ఇది నిజం. అమెరికా డెలావర్ ప్రాంతంలో ఉండే ఓ మహిళా రియల్టర్ చాట్ జీపీటీ సలహాలను పాటిస్తూ కేవలం నెల రోజుల్లో 20 లక్షల రూపాయల అప్పును తీర్చగలిగింది. నిజజీవితంలో పనికొచ్చేలా అది చెప్పిన వివిధ సలహాలు పాటిస్తూ ముందుకెళ్లడమే తను అప్పుల ఊబి నుంచి కాస్త బయట పడటానికి కారణమని ఆమె చెబుతుండటం ఎవరికైనా ఆసక్తి కలిగించే విషయమే. మరి ఆమె ఎవరు? ఆ అప్పుల్ని ఎలా తీర్చగలిగారు?.. అన్నది తెలుసుకుందాం రండి. జెన్నీఫర్ అలాన్ అమెరికాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటుంది. వయసు 35 సంవత్సరాలు. డబ్బులు బాగానే సంపాదించినా, వాటిని సక్రమంగా వినియోగించడం చేతకాక పోవడంతో ఒకానొక దశలో రోజువారీ ఖర్చుల కోసం కూడా అప్పు చేయాల్సిన స్థితికి చేరుకుంది. ముఖ్యంగా ఆమెకు ఓ బిడ్డ పుట్టాక ఖర్చులు మరింత పెరిగాయి. అలాగని తానేం విలాసవంతంగా బతకలేదు. సాధారణ జీవితం గడపడానికీ డబ్బులు సరిపోని పరిస్థితి ఏర్పడేసరికి సమస్యను తీర్చమంటూ చాట్ జీపీటీని ఆశ్రయించిందామె. నిజజీవితంలో ఆచరించగలిగేలా కొన్ని సూచనలు చేయమని దానికి చెప్పింది. అయితే నిజంగానే అది విలువైన సూచనలు చేసింది. వాటిని పాటించిన ఆమె ఒక్క నెలలో తన అప్పుల్లో సగం%ా% అంటే 20 లక్షలకు పైగా మొత్తాన్ని తిరిగి చెల్లించగలిగింది.

### 30 రోజుల చాలెంజ్

బ్యూటీ చాలెంజ్, వాటర్ చాలెంజ్, గ్రీన్ చాలెంజ్‌లలాగే తన అప్పు తీర్చేందుకు చాట్ జీపీటీతో కలిసి థర్టీ డే చాలెంజ్‌ను తీసుకుంది జెన్నీఫర్. అందుకోసం అప్పటికప్పుడు తాను చేయదగ్గ సలహాలు ఇమ్మంటూ కృత్రిమ మేథ ఆధారితంగా పనిచేసే చాట్ జీపీటీని అడిగింది. ముందుగా వాడని నెలవారీ, ఏడాది సబ్‌స్క్రిప్షన్‌లను తొలగించమని, నిరుపయోగంగా వదిలేసిన అకౌంట్లను పరిశీలించమని చెప్పింది అది. అలా కొన్ని సబ్‌స్క్రిప్షన్లు ఆపేసి, తర్వాత అకౌంట్లు, డిజిటల్ వ్యాలట్‌లను పరిశీలిస్తుండగా క్రియారహితంగా ఉన్న బ్రోకరేజ్ అకౌంట్‌లో ఆమెకు 10000 డాలర్లు కనిపించాయి. అంటే మన డబ్బుల్లో ఎనిమిదిన్నరల లక్షల పై చిలుకే. ఇక నెలవారీ కిరాణా ఖర్చులకు సంబంధించీ అది కొన్ని చిట్కాలు సూచించింది. ముందే కొని ఉన్న పదార్థాలతో ఆహారం తయారు చేసుకోవడం, అలాగే పాడయ్యే అవకాశంతో పాటు ఖరీదు కూడా ఎక్కువ ఉండే తాజా కూరలతో పోలిస్తే తక్కువ ఖరీదులో దొరికే క్యాన్డ్ ఫుడ్‌ను అంటే నిల్వ ఉండే ఆహార పదార్థాలను ఎంచుకోవడంలాంటివి చెప్పింది. దీని ద్వారా ఆమె నెలలో ఏకంగా 50 వేల రూపాయల దాకా మిగిల్చగలిగిందట. అలా 30 రోజుల చాలెంజ్ పూర్తయ్యే సరికి తన అప్పులో సగం అంటే సుమారు 20 లక్షల రూపాయలను తీర్చేసింది. ఇక, మిగతాది కూడా తీర్చడం కోసం మరో థర్టీ డే చాలెంజ్‌ను తీసుకోబోతున్నట్టు చెప్పింది జెన్నీ. అంకెలు చూసి భయపడకుండా ఏం చేయగలమో ఆలోచిస్తూ, దాన్ని ఆచరించే పనిలో పడితే నెమ్మదిగా అప్పులు వాటంతట అవే తరిగిపోతాయని ధైర్యంగా చెబుతున్నదామె! అధునాతన సాంకేతికత అనర్థాలనే కాదు, సరిగ్గా వినియోగిస్తే అద్భుత ఫలితాలనూ ఇస్తుందనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుంది కదూ ఈ సంఘటన.

## ఏఐతో మెదడుకు చేటు!



కృత్రిమ మేధ (ఏఐ)ను పరిమితికి మించి వాడితే.. మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుందట. దీర్ఘకాలంలో మనిషి ఆలోచనా శక్తి తగ్గిపోయే ప్రమాదం కూడా ఉన్నదట. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. సర్వేలో భాగంగా 54 మందిని ఎంపిక చేశారు. ఒక్కొక్కరితో మూడేసి వ్యాసాలను రాయించారు. మొదటిసారి వారినే సొంతంగా ఆలోచించి రాయమని చెప్పారు. రెండోసారి గూగుల్‌లో వెతికి.. ఆ తర్వాత, ఏఐ సాయంతోనూ వ్యాసాలను రాయించారు. ఈ సందర్భంగా వారి మెదడులో జరిగే ఎలక్ట్రానిక్ కార్యకలాపాలను పరిశీలించారు. ఆశ్చర్యంగా.. సొంతంగా ఆలోచించి వ్యాసాలు రాసినప్పుడు మెదడు ఎక్కువ ఉత్సాహంగా పనిచేసినట్టు కనుగొన్నారు. మెదడు పనితీరు కూడా మెరుగుపడ్డట్టు గుర్తించారు. ఇక గూగుల్‌లో వెతికినప్పుడు ఆ ఉత్సాహం తగ్గినట్టు కనిపిస్తే.. ఏఐ సాయంతో వ్యాసం రాసేటప్పుడు మెదడు ప్రభావం ఏమాత్రం లేనట్టు చెప్పుకొచ్చారు. దీర్ఘకాలంలో ఈ అలవాటు మెదడుకు చేటు చేస్తుందని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. సరికొత్త సాంకేతికత ఎప్పుడు వచ్చినా, మనిషి సామర్థ్యాన్ని దెబ్బతీస్తూనే ఉన్నదని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'క్యాలిక్యులేటర్' అందుబాటులోకి వచ్చిన తర్వాత.. విద్యార్థులు చేతితో లెక్కలు చేయడం తగ్గిపోయిందని చెప్పుకొచ్చారు. దీర్ఘకాలంలో చిన్నచిన్న లెక్కలను కూడా సొంతంగా చేసుకోలేని పరిస్థితి వచ్చిందని వెల్లడించారు. ఏఐ కూడా ఈ విధంగానే మనుషుల మెదడుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. కాబట్టి, ఏఐని పరిమితంగానే వాడుకోవాలని వారు సూచిస్తున్నారు.

## మాన్‌సూన్.. మసాలా!

సుగంధ ద్రవ్యాలు.. ఆహార పదార్థాలకు అద్భుతమైన రుచిని అందిస్తాయి. ఘాటైన వాసనలతో వంటలను పరిమళ భరితంగా మార్చేస్తాయి. అంతేకాదు.. ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ఇవి ముందుంటాయి. అయితే, మాన్‌సూన్ సీజన్‌లో.. మసాలా దినుసులు త్వరగా పాడవుతాయి. వర్షాకాలపు తేమతో.. సుగంధాన్ని కోల్పోయి పనికిరాకుండా పోతాయి. అలా కాకుండా ఉండాలంటే.. ఈ చిట్కాలు ఎంతగానో ఉపయోగపడతాయి. వర్షాకాలంలో గాలిలో తేమ పెరుగుతుంది. దాంతో మసాలా పొడులు ముద్దగా అయిపోతాయి. ఇతర దినుసులు, సుగంధ ద్రవ్యాలపై బూజు, ఫంగస్ లాంటివి పెరుగుతాయి. అందుకే.. నిల్వ చేయడానికి ముందే సుగంధ ద్రవ్యాలను కొద్దిగా వేయించాలి. దీనివల్ల వాటిల్లో తేమ తగ్గిపోతుంది. నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. అంతేకాదు, ఈ సింపుల్ డ్రై రోస్టింగ్‌తో అవి మరింత రుచికరంగా మారుతాయి. తేమ వల్ల ఇనుప డబ్బాలు తుప్పు పడుతుంటాయి. వాటిలో నిల్వచేసిన మసాలాల్లోనూ ఈ తుప్పు కలిసిపోయి.. అనారోగ్యాన్ని కలిగిస్తాయి. కాబట్టి, సుగంధ ద్రవ్యాలను గాజు పాత్రలలో నిల్వ చేయండి. గాలి చొరబడని ఎయిర్‌టైట్ కంటైనర్లను వాడండి. కిచెన్‌లో తేమ ఎక్కువగా ఉండే సింక్, వాష్ ఏరియాలకు మసాలా డబ్బాలను దూరంగా ఉంచండి. అలాగే, ఆ డబ్బాలపై సూర్యకాంతి నేరుగా పడకుండా చూసుకోండి. మసాలా దినుసులను వాడటానికి ముందు.. చేతులను శుభ్రంగా కడుక్కొని, పొడి వస్త్రంతో బాగా తుడుచుకోవాలి. లేకుంటే.. సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియాతో అవి కలుషితమైపోతాయి. చాలామంది అన్ని దినుసులను ఒక్క డబ్బాలోనే నిల్వచేస్తారు. దీనివల్ల వాటి సహజసిద్ధమైన రుచి మారుతుంది. బదులుగా.. ఒక్కో దినుసును ఒక్కో డబ్బాలో నిల్వచేయండి.




# మార్కెట్

## స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 270 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. యూఎస్ సుంకాల ఉద్రిక్తతలు సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మార్కెట్లు నిదానంగా కదలాడాయి. భారత్–యూఎస్ వాణిజ్య చర్చలు నిలిచిన నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్లు ఉదయం నష్టాల్లో మొదలైనా.. చివరి సెషన్‌లో కోలుకోవడంతో లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,387.03 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,320.95 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 83,812.31 పాయింట్లకు పెరిగింది. చివరకు 270.01 పాయింట్ల లాభంతో 83,712.51 వద్ద స్థిరపడింది. మరో వైపు నిఫ్టీ సైతం 61.20 పెరిగి 25,522.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,889 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 1,990 షేర్లు నష్టాల్లో ముగిశాయి. విస్తృత మార్కెట్లు స్వల్పంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్‌ల లాభాలతో బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ దాదాపు 60 బేసిస్ పాయింట్లు లాభపడింది. ఐటీ, రియాలిటీ, మీడియా సూచీలు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు, ఫార్మా, పబ్లిక్ బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ స్టాక్‌లు పడిపోయాయి.



## మొబైల్ చార్జీలకు రెక్కలు?

న్యూఢిల్లీ : మొబైల్ ఫోన్ వినియోగదారులకు మరోసారి చార్జీల మోత మోగనున్నది. ఎకనామిక్ టైమ్స్ (ఈటీ) టెలికం నివేదిక ప్రకారం.. దేశీయ టెలికం కంపెనీలైన భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియాలు ఈ ఏడాది ఆఖరుకల్లా ప్లాన్ల ధరల్ని 10 నుంచి 12 శాతం పెంచాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే జరిగితే కస్టమర్లపై చార్జీల భారం ఆయా ప్లాన్లు, వాటి కాలపరిమితి, రోజువారీ డాటానుబట్టి గరిష్ఠంగా రూ.500 వరకు పడటం ఖాయం. నాడు 23% వరకు.. ఏడాది క్రితం జూలైలోనే భారతీయ టెలికం సంస్థలు తమ మొబైల్ ఫోన్ ప్లాన్ల ధరల్ని 11 నుంచి 23 శాతం వరకు పెంచాయి. దీంతో ప్లాన్ వ్యవధి, దాని డాటా, ఇతరత్రా ఆఫర్లనుబట్టి గరిష్ఠంగా రూ.900 వరకు ధరలు పెరగడం గమనార్హం. నిజానికి పాపులర్ ప్లాన్ల ధరలు ఇప్పటికే రూ.200కుపైగా పెరగడంతో మొబైల్ ఫోన్ యూజర్లు



ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఈ క్రమంలో మళ్లీ భారీ ఎత్తునే చార్జీల పెంపునకు వీలుందన్న వార్తలు.. కస్టమర్లకు గుబులు పుట్టిస్తున్నాయి. సహజంగా మార్కెట్‌లో 3 నెలల ప్లాన్లు ఎక్కువగా అమ్ముడుపోతాయి. దీంతో డిసెంబర్‌కల్లా వాటి ధరలు ఇంకో రూ.70–85 మేర పెరిగే వీలున్నది.

పెరిగిన యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు..ఈ ఏడాది మే నెలలో టెలికం సంస్థల యాక్టివ్ సబ్‌స్క్రైబర్లు భారీగా పెరిగారు. ఈ నేపథ్యంలోనే రిచార్జ్ ధరల్ని టెల్కోలు పెంచాలని భావిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ధరలు పెంచితే మరో టెలికం నెట్‌వర్క్‌లోకి తమ వినియోగదారులు వెళ్లకుండా టెలికం సంస్థలు ఓ నిర్దిష్ట విధానంపైనా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా ప్లాన్లపై ఆకర్షణీయ ఆఫర్లు వచ్చే వీలుందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి కస్టమర్లు ఒక సంస్థ నుంచి మరో సంస్థకు వెళ్లిపోతుంటే కంపెనీలు చార్జీల పెంపునకు వెనుకాడుతాయి. అలాకాకుండా ఒకే సంస్థలో కొనసాగుతున్నట్టైతే ధరల మోతకు సాహసిస్తాయి. ఇప్పుడిదే వాతావరణం పరిశ్రమలో కనిపిస్తున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రస్తుతం దేశంలో 100 కోట్లకుపైగానే టెలికం వినియోగదారులున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

## ఒక్కరోజే 54 పైసలు డౌన్

### డాలర్‌ముందు రూపాయి విలవిల

ముంబై : అగ్రరాజ్యం అమెరికా డాలర్ దెబ్బకు రూపాయి మారకానికి భారీ చిల్లులుపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం ఒకేరోజు 54 పైసలు పడిపోయి 85.94కి జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, డాలర్ బలోపేతం కావడంతో ఇతర కరెన్సీలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రతీకార సుంకాల విధింపుపై అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతో దేశీయ కరెన్సీపై తీవ్ర ప్రభావం చూపిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 85.53 వద్ద ప్రారంభమైన డాలర్–రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 85.51–86.03 స్థాయిలో కదలాడింది. చివరకు గత ముగింపుతో పోలిస్తే 54 పైసలు కోల్పోయి 85.94 వద్ద స్థిరపడింది. గతవారంలో రూపాయి విలువ 20 పైసలకు పైగా పెరిగిన విషయం తెలిసిందే. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర స్వల్పంగా పెరిగి 68.48 డాలర్లకు చేరుకున్నది.



# ఆంధ్రప్రదేశ్

## పిఠాపురం టిడిపిలో మార్పులు

### టిడిపి ఇన్‌ఛార్జ్‌గా వర్మకు ఉద్వాసన

అమరావతి,మే7 : పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బాధ్యతల్లో ఆ పార్టీ హై కమాండ్ మార్పు చేసింది. ప్రస్తుత ఇన్‌చార్జ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వత్సవాయి సత్యనారాయణ వర్మను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. త్వరలో నియోజకవర్గ పార్టీ వ్యవహారాల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ కమిటీ నియామకంపై కసరత్తును టీడీపీ హై కమాండ్ ప్రారంభించింది. వీలైనంత త్వరగా కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు అధిష్ఠానం స్పష్టం చేసింది. ఈ విషయంపై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పలురకాల సమీకరణాలతో టీడీపీలో మార్పులు జరుగుతుంటాయని చెప్పుకొచ్చారు. చివరగా పార్టీ బాగుండేలా హై కమాండ్ చూడాలని అన్నారు. మంత్రి నారా లోకేశ్ తనతో మాట్లాడిన తర్వాతే పిఠాపురం టీడీపీలో నూతన కమిటీ ఏర్పాటును నిర్ణయించారని తెలిపారు. టీడీపీలో నాయకులే ఇక్కడ నిర్వహణ చేస్తారని.. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను పూర్తిగా సహకరిస్తానని వర్మ స్పష్టం చేశారు.

## అల్లూరి ఆశయాలు భావితరాలకు దిక్సూచి

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,మే7 : బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ భావి తరాలకు స్ఫూర్తిదాయకం, దిక్సూచి అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుడు అల్లూరి సీతారామరాజు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మన్యం ప్రాంత ప్రజల్లో చైతన్యం నింపి, స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేలా బ్రిటిష్ పాలకులపై ఆయన చేసిన పోరాటం, త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తిని తరతరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

### ఏకసభ్య కమిషన్ నివేదికపై కమిటీ

అమరావతి,మే7 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ జీవో నంబర్ 900ను జారీ చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికలో బయటపడిన అంశాలు, సిఫార్సులను వివరంగా అధ్యయనం చేయాలని ఆదేశించింది. పాలనాపరంగా అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సిన అంశాలపై సూచనలు చేయాలని కమిటీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏకసభ్య కమిషన్ నివేదికలోని నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేయాల్సిన అంశాలను సూచించాలని ప్రభుత్వం తెలిపింది. ఈ సిఫార్సులను అమలు చేసేందుకు తగిన పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కమిటీ సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిటీ తన నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని జీవోలో స్పష్టంగా సూచించింది.

## ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?

### లోకేశ్ ఆసక్తికర పోస్ట్

అమరావతి,మే7 : సోషల్ మీడియా ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ ఓ ఆసక్తికర వీడియోను పోస్ట్ చేశారు. 'ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?' అంటూ ఓ వీడియోను పోస్ట్ చేశారు. వీడియోను పోస్ట్ చేసిన లోకేశ్.. అందులో నీట్‌గా టక్ వేసుకుని, ట్రెండీ కళ్లజోడు పెట్టుకుని.. న్యూ లుక్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్(బు÷-లలెట్) డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నట్లు కనిపించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. మంత్రి లోకేశ్ లుక్‌ను పరిశీలించిన నెటిజన్లు ఏపీకి ఎవరు వస్తున్నారో కనిపెట్టేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు రాబోతున్నట్లు అంచనా వేశారు. బుధవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో భారీగా పెట్టుబడులకు ఆమోదముద్ర వేసింది. అందులో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏపీకి రాబోతోందంటూ ఇన్‌డైరెక్ట్‌గా ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

## నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి

### భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలి

### ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి పిలుపు

హైదరాబాద్,మే7 : ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని 'పూరెస్ట్ ఆఫ్ ది పూర్' కు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని అన్నారు. దర్పవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంపద సృష్టితోనే అభివృద్ధి సాధ్యం

**అభివృద్ధి లేకుంటే సంక్షేమం లేదు**


**రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ చాలా ముఖ్యం**

**వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పు**

**రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నాం**

**కలెక్టర్ల సమిష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం**

**కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు**



అమరావతి,మే7 : అభివృద్ధి లేకుంటే సంపద లేదని.. సంపద లేకుంటే సంక్షేమం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మనం అందించే సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ గురువారం సచివాలయంలో జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. అధికారులు సమష్టిగా పనిచేసి.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజాసమస్యలను వందశాతం పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పుగా వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. జగన్ హయాంలో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన స్కీముల నుంచి రూ. 10వేల కోట్లు డైవర్ట్ చేశారని ధ్వజమెత్తారు. దీంతో వారు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. రూ.1,30000 వేల కోట్లు అప్పులు చెల్లించకుండా ఉంచేశారని మండిపడ్డారు. ఏపీని పునఃనిర్మిస్తామని తాను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ అనేది చాలా ముఖ్యమని చెప్పుకొచ్చారు. అందరి సహకారంతో రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని.. ఇది సమష్టి విజయమని ఉద్ఘాటించారు. ఈ అవార్డు తనకు బాధ్యతతో కూడినది అని.. నిజానికి ఇలాంటి అవార్డులు పాజిటివ్ మూడ్ క్రియేట్ చేస్తాయని వ్యాఖ్యానించారు. మీ అందరి సహకారంతోనే తనకు ఈ అవార్డు వచ్చిందని అన్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారని? ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారనే దానికి ఈ అవార్డు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామస్థాయి అధికారి వరకు పనిచేయడం వల్లే ఈ అవార్డు దక్కిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను ఏపీకి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. గ్రీన్‌ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు రూ.23లక్షల కోట్ల ఎంవోయూలు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే జరిగిన ఎంవోయూల ద్వారా 24లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. దేశంలోని అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. వారానికో కంపెనీ తీసుకొస్తున్నామని.. రోజుకో శంకుస్థాపన చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు రెండు జిల్లాల నుంచి కొత్తగా కలెక్టర్‌లు వచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల మ్యాండేట్ నిన్న కూడా చూశామని... సరిగా పనిచేయకపోతే ప్రజలు ఆదరించరని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యం కారణంగా ఈ సమావేశానికి రాలేకపోయారని... తాము ఇద్దరం కలిసి ఇచ్చిన హామీలు నేరవేర్చాల్సి ఉంటుందని చెప్పారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు ఏపీలో ఏమాత్రం అభివృద్ధి లేకపోయినా ఇప్పుడు చాలా వరకూ ట్రాక్‌లో పెట్టగలిగామని అన్నారు. ఆర్థిక అసమానతలు పరిష్కరించి జీవన ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల కలయికే కూటమి ప్రభుత్వమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో డెలివరీ లీకేజీలు ఎక్కువగా ఉండేవని... ఇప్పుడు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు వెళ్తున్నాయని వివరించారు. జగన్ హయాంలో ఏపీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రోడ్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు కలెక్టర్ రిపోర్టు పంపేవారని.. అయితే వారు ఇప్పుడు పంపక్కరలేదని... తామే పంపిస్తామని అన్నారు. ప్రజాసమస్యలు అన్నింటిని పాజిటివ్‌గా పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవస్థను మ్యానేజ్ చేయడానికి కాదని.. దాన్ని మార్చడానికి ఈ ప్రభుత్వం ఉందని తెలిపారు. డబ్బు లేదనేది నిజం కాదని... డబ్బును సృష్టించి పనులు చేయించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సదస్సులో మంత్రులు, సిఎస్ , డిజిపి తదితరు అధికారులు పాల్గొన్నారు.

## సమాచారశాఖ చురుకుగా పనిచేయాలి

### ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

### కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రాబాబు

అమరావతి,మే7 : ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను ఎందుకు ఉపయోగించుకోవడం లేదని సమాచార శాఖను చంద్రబాబు ప్రశ్నించారు. సమాచార పౌర సంబంధాల శాఖపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద ఐ అండ్ పీఆర్ వ్యవస్థ సరిగా పనిచేయకుండా కేవలం ఓ ఆభరణంలా తయారైందని సీరియస్ అయ్యారు. స్థానికంగా ఉండే ఇన్‌ఫ్లూయెన్సర్ల సాయంతో చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. కొందరు అధికారుల పనితీరు అభివృద్ధిని అడ్డుకునేలా ఉండటం సరికాదని సీఎం చంద్రబాబు హితబోధ చేశారు. పోడు వ్యవసాయాన్ని అడ్డుకుంటామంటే అరకులో కాఫీ పంట ఉంటుందా..? అని నిలదీశారు. అధికారులు మారి అభివృద్ధికి ఊతం ఇవ్వాలని హితవు పలికారు. కొందరు అధికారుల సర్వీసులను ఎందుకు అమల్లోకి తీసుకోవడం లేదని నిలదీశారు. ఇది డబల్ ఎడ్జి వెపన్ అటు ఇటు వాడుతారని.. అలాంటప్పుడు వాటిని సరిగా ఎందుకు కౌంటర్ చేయట్లేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సచివాలయంలో జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. కలెక్టర్‌ల మధ్య, జిల్లాకు జిల్లాకు మధ్య పోటీ ఉండాలని సీఎం సూచించారు. ఇన్నోవేటివ్ ఐడియాలు తీసుకువస్తే అధికారులను మెంటర్‌గా నియమిస్తామని చెప్పుకొచ్చారు. ఎంతవేగంగా పనులు చేస్తే అంతేవేగంగా ఫలితాలు వస్తాయని సూచించారు. ప్రత్తి÷లులోని సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశర చేశారు. కలెక్టర్లు రిజల్ట్ ఓరియెంటేషన్‌తో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## జలధారతో చెరువులకు నూతన జీవం

### ఫీడర్ ఛానళ్ల పునరుద్ధరణతో బహుళ ప్రయోజనాలు

### సాగునీటితో పాటు భూగర్భ జలాల వృద్ధికి దోహదం

### ప్రభుత్వ జల సంరక్షణ కార్యక్రమాలపై సర్వత్రా హర్షం

విజయవాడ,మే7 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార?జలహారతి కార్యక్రమం కింద ఎన్‌టీఆర్ జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జి.కొండూరు మండలంలోని చెరువుమాధవరం గ్రామ పరిధిలో ఉన్న గ్రంథివాని చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పూర్తయితే వర్షాకాలంలో వచ్చే నీరు సక్రమంగా చెరువుకు చేరే అవకాశం కలుగుతుంది. దీంతో గ్రంథివాని చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, గ్రామంలోని వ్యవసాయ భూములకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. చెరువు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుంది. అదేవిధంగా రైతులు వరి, మిర్చి, కూరగాయలు తదితర పంటలను సకాలంలో సాగు చేసుకునే అవకాశం పొందడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశముంది. అదేవిధంగా గ్రామ పరిసరాల్లో పచ్చదనం పెరగడం, పశువులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడడం, నీటి కొరత సమస్య తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు గ్రామ ప్రజలకు చేకూరనున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత చెరువుమాధవరం గ్రామం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడు తున్నారు.

## త్వరలో స్థానిక ఎన్నికల నిర్వహణ

### ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు

### అందుకు తగ్గట్లుగా వ్యవసాయ ప్లాన్ ఉండాలి

### స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై కలెక్టర్ల కు బాబు సూచన

అమరావతి,మే7 : త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లతో అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై కలెక్టర్ల సదస్సులో సీఎం సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉందని, దీనికి తగ్గట్టు కలెక్టర్లు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాధార పంటలు, మెట్ట పంటలు, ఉద్యాన పంటలకు అనుగుణంగా నీటి ప్రణాళికలు చేసుకోవాలన్నారు. స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల సేకరణ, స్వచ్ఛ రహదారుల శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించగలిగితే మరింత అభివృద్ధి సాధించగలమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రైలు మార్గం ద్వారా ప్రతి కిలోమీటరుకు రూ.1.83 వ్యయం అవుతుంటే రహదారి మార్గంలో జరిగే రవాణాపై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలని తెలిపారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారి ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటితో పాటు రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయని, నాలుగు లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగబోతోందని వెల్లడించారు. ఆర్వోబీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి కావాలని స్పష్టం చేశారు. లాజిస్టిక్స్ పార్కులు వస్తే పెద్ద ఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ వస్తుందన్నారు.

## చేపలవేటపై నిషేధంతో కొండెక్కిన ధరలు

చెన్నై,మే7 : తమిళనాడు రాయపురం నియోజకవర్గంలోని కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో చేపల ధరలు రెండింతలు పెరగడంపై మాంసాహారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం చేపల వేట నిషేధం అమల్లో ఉన్నందు వల్ల సముద్ర గర్భంలోకి చేపల వేటకు మర పడవలు వెళ్లలేని పరిస్థితి. దీంతో రాయపురం, కాశిమేడు, పట్టిణంబాక్కం, కోవలం, నాగపట్టిణం, నాగూర్, పుదుకోట, రామనాథపురం, రామేశ్వరం తదితర సముద్రతీర జిల్లాల్లో వేల సంఖ్యలో మరపడవలు నిలిచిపోయాయి. అదే సమయంలో ఇంధనంతో పనిచేయని చిన్న నాటు పడవలు, ఫైబర్ బోట్లలో చేపల వేటలో పాల్గొనేందుకు అనుమతించారు. ఈ పడవల్లో సముద్రంలోకి వెళుతున్న మత్స్యకారులు తమ వలల్లో చిక్కిన చేపలు, రొయ్యలు, పీతలతో తీరానికి చేరుకుని వేలం ద్వారా విక్రయిస్తున్నారు. దీంతో చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటాయి. సముద్రంలోకి వెళ్లి కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో చేపలతో జాలర్లు తిరిగొచ్చారు. కిలో వంజరం రూ.1,500, బ్లాక్‌వవ్వాల్ రూ.1,200, వైట్‌వవ్వాల్ రూ.1,600, ఐవ్‌వవ్వాల్ రూ.1,900, పారై రూ.700, సంకర రూ.700, పీతలు రూ.600, రొయ్యలు రూ.500, టైగర్ రొయ్యలు రూ.1,400కు విక్రయించారు.

## విశాఖ బీచ్‌రోడ్‌లో అల్లూరి స్ఫూర్తి యాత్ర

### యాత్రలో పాల్గొన్న బిజెపి అధ్యక్షుడు మాధవ్

విశాఖపట్నం,మే 7 : స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన విప్లవ నాయకుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో 'అల్లూరి స్ఫూర్తి యాత్ర' నిర్వహించారు. గురువారం ఉదయం విశాఖ బీచ్ రోడ్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి భారీ సంఖ్యలో కార్లు, బైక్‌లతో ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అల్లూరి విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర ఆయన జీవితం, పోరాటం సంబంధిత ప్రాంతాల మీదుగా సాగింది. బ్రిటిష్ వారు అల్లూరి సీతారామరాజును బంధించిన మంప గ్రామం మీదుగా, ఆయనను కిరాతకంగా కాల్చి చంపిన రాజేంద్రపాలెం ప్రాంతాన్ని బీజేపీ నేతలు సందర్శించనున్నారు. అక్కడ నుంచి అల్లూరిని ఆంగ్లేయులు సమాధి చేసిన కె.డి.పేట చేరుకొని ఘన నివాళులు అర్పించనున్నారు.


## విజయ్‌ను అడ్డుకుంటున్న కేంద్రం

### ఒక్క సీటున్న బిజెపి రాజకీయం తగదు

### గవర్నర్ తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం

### కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఆగ్రహం

చెన్నైచెన్నై,మే7 : తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న 'తమిళగ వెట్రి కజగం' అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ పూర్తి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఎంతో ఆశగా ఓటు వేసినప్పటికీ, నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. తమిళనాడులో వచ్చిన తీర్పు విజయ్ నాయకత్వానికి ప్రజల మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఠాగూర్ పేర్కొన్నారు. గవర్నర్ వెంటనే విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. 'తమిళనాడులో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారని మనందరికీ తెలుసు.. ప్రజలు ఒక కొత్త నాయకుడి కోసం ఓటు వేశారు. ఆ పార్టీ నుంచి 108 మంది సభ్యులు ఎన్నికయ్యారు'. అని ఠాగూర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతుతో బలం 113కు చేరిందని, 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మెజారిటీ మార్కుకు కేవలం కొన్ని సీట్ల దూరంలోనే ఉందని ఆయన గుర్తుచేశారు. 'గవర్నర్ బీజేపీకి చెందిన వ్యక్తి.. ఆయన గతంలో బీజేపీలో పనిచేశారు. ఆయనకు బీజేపీ మనస్తత్వం ఉందని మనందరికీ తెలుసు. విజయ్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదన్నదే 'ఢిల్లీ' ఆలోచన'. అని ఆయన ఆరోపించారు. గవర్నర్‌పై బీజేపీ నాయకత్వం నుంచి ఒత్తిడి ఉందని ఠాగూర్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నప్పటికీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. రాజ్యాంగ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా విజయ్‌ను సభలో బలాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ సూచించారు. 'విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి త్వరగా ఆహ్వానించాలని, సభలో బలాన్ని నిరూపించుకోవడానికి అనుమతించాలని భావిస్తున్నా.. అదే న్యాయం.' అని ఠాగూర్ అన్నారు.




# పెద్ది ఎడిటింగ్ వర్క్ పూర్తి

## 4న విడుదలకు రంగం సిద్ధం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ డైరెక్టర్ బుచ్చి బాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది గురించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్ర ఎడిటింగ్ వర్క్ పూర్తయినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమా అవుట్‌పుట్ చిత్ర బృందం ఎంతో సంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జూన్ 4న విడుదల కానున్నప్పటికీ, అంతకంటే ఒకరోజు ముందే అంటే జూన్ 3న భారీ స్థాయిలో ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివరాజ్ కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఓవర్సీస్‌లో మే 7 రాత్రి నుంచి 'పెద్ది' అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. విడుదల తేదీ దగ్గరపడుతుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. తాజాగా సినిమా ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా పాల్గొని, పెద్ది గురించి పలు విశేషాలు పంచుకున్నారు. 'పెద్ది'లో 70-80ల మధ్య విజయనగరం బ్యాక్‌డ్రాప్ ఉంటుందన్నారు. పొలం గట్టుపై కూర్చొని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ కలుగుతుందో.. ఈ సినిమా చూసినా అదే ఫీలింగ్ కలుగుతుందన్నారు. మరోవైపు త్వరలోనే దీని ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# కార్తీతో మ్యాడ్ డైరెక్టర్ మూవీ


తమిళ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతుందనే విషయం తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైనట్లు తెలుస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమంతో అధికారికంగా పట్టాలెక్కింది. టాలీవుడ్‌లో 'మ్యాడ్' ,'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్, ఇప్పుడు హీరో కార్తీతో ఒక భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను ఎ÷-లాన్ చేశారు. ఈ సినిమాలో కార్తీ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించబోతుంది. నేడు హైదరాబాద్‌లో జరిగిన ముహూర్తపు వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు మరియు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నట్లు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ తోడవడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.





# శంబాల డైరెక్టర్‌తో సందీప్ కిషన్ మూవీ

టాలెంటెడ్ నటుడు సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. సందీప్ కెరీర్‌లో 33వ చిత్రంగా అత్యంత భారీ స్థాయిలో రూపొందనున్న కొత్త ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇదొక సోషియో-ఫాంటసీ, మైథాలజికల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కనుంది. 'మౌనంగా జన్మించాడు.. కాలాలను జయించేందుకు సిద్ధమయ్యాడు' అనే అర్థం వచ్చేలా విడుదల చేసిన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ పోస్టర్‌లో సింహం ఒక చిన్నారిని చూస్తూ గంభీరంగా కనిపిస్తుండగా, మధ్యలో ఉన్న కత్తి సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహిధర్ రెడ్డి ఈ పాన్-ఇండియా చిత్రాన్ని అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, ఈ ఏడాది ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది.





# ఓటిటిలోకి తిమ్మరాజుపల్లి టీవీ

హీరో కిరణ్ అబ్బవరం నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై అందరికీ బాల్యంలోని జ్ఞాపకాలను గుర్తుచేసింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకుల ముందుకువచ్చేందుకు సిద్ధమైంది. మే 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా తెలుపుతూ ఆహా పోస్టర్ విడుదల చేసింది. కొత్త నటీనటులను పరిచయం చేస్తూ వి.మునిరాజ్ ఈ సినిమాను తెరకెక్కించారు. టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం. తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అ÷-దదెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొ÷-టటె). ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదేరోజు రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అన్నది మిగిలిన కథ.




# అగధ టీజర్ విడుదల

కామాక్షి భాస్కర్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విశ్వంలో ఎన్నో అతీత శక్తులు దాగున్నాయంటూ ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది. 'అగధ' ముందు ఎవరి ఆటలు సాగవంటూ చెప్పే డైలాగ్ పాత్ర ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ప్రతిక్షణం ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించాలన్నదే తన ప్రయత్నమని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, గెటప్స్, ఆ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ , భయం గొలిపే లొకేషన్లు, విచిత్రమైన ఎక్స్ప్రెషన్స్ , మధ్య మధ్యలో ఆసక్తి రేకెత్తించే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. 'ఆ వీడియోలో నువ్వు ఏం చూసావమ్మా' అని అడిగితే, ఒక అమ్మాయి భయంతో వణికిపోతూ 'అగ్... అగ్... అగధ' అని చెప్పడంతో 'అగధ' అంటే ఎవరు అనే ఆసక్తి కలుగుతుంది. 'అగధ' వచ్చేసిందమ్మా. 'అగధ' ముందు ఎవ్వరి ఆటలు సాగవు. రా... 'అగధా? రా'అంటూ వినిపించే డైలాగ్స్ తో టీజర్ తాలూకు ఉత్కంఠ పీక్ లెవెల్ కి చేరినట్టుగా అనిపిస్తుంది. త్వరలో ట్రైలర్ ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## జీవితంలో కొన్ని త్యాగాలు తప్పవు: జాన్వీ

'జీవితంతో కొన్ని సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయాలి, సవాళ్లను ఎదుర్కొవాలి, అలాగే అభిమానులు, ప్రేక్షకులను మెప్పించాలంటే కథానాయికగా బలమైన కథలు ఎంచుకోవాలి. వాటితో ప్రేక్షకులను మెప్పించాలి. అందుకోసం చాలా కష్టపడాలి' అంటున్నారు బాలీవుడ్ యువకథానాయిక జాన్వీకపూర్. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం కోసం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. రాజ్‌కుమార్ రావ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రమిది. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కింది. ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో షూటింగ్ టైమ్‌లో ఎదుర్కొన్న సవాళ్లను గురించి చెప్పుకొచ్చింది. ఈ సినిమా కోసం రేయింబవళ్లు కష్టపడి క్రికెట్ నేర్చుకున్నాను. దర్శకుడు శరణ్ శర్మ ఏ పనిలోనైనా నాణ్యతని కోరుకుంటారు. శిక్షణ సమయంలో ఎన్నో దెబ్బలు తగిలాయి. భుజాలు డిస్‌లొకేట్ అయ్యాయి. ఈ చిత్రాన్ని వదిలేద్దామని అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ నేను క్రికెట్ ఆడగలనని నాలో ధైర్యం నింపింది శిక్షకులు అభిషేక్ నాయర్, నాయర్, విక్రాంత్ సర్ మాత్రమే' అని అంది. మేము కూడా షూటింగ్ సమయంలో ధోని ధరించే ఏడు నంబరు జెర్సీనే ఉపయోగించాలనుకున్నాం. కానీ ఆ నంబరు ఆయనకు మాత్రమే సొంతం అనుకొని ఆరుని నిర్ణయించాం. అంతేకాదు ఆరు నా లక్కీ నంబరు కూడా. ఈ సినిమాకు కూడా ఆ అదృష్టం కలిసిరావాలని ఆశిస్తున్నా' అని చెప్పారు. జాన్వీ. ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ప్రస్తుతం జాన్వీ రెండు తెలుగు చిత్రాల్లో కూడా నటిస్తోంది. ఎన్టీఆర్ సరసన 'దేవర', రామ్‌చరణ్, బుచ్చిబాబు సాన కాంబోలో వస్తున్న చిత్రంలోనూ నటిస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com